

▶ అర్జీలు చూడని అధికారులకు షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 349 ఫిర్యాదులు

-8లో

పర్యాటక శాఖ భూములు లీజుకు...

ఔత్సాహికులకు అవకాశం

ప్రాజెక్టులు పర్యాటకులను ఆకర్షించేలా, ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడేలా, ఉపాధి అవకాశాలు కల్పించేలా ఉండాలి

- ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యం
- విశాఖ జిల్లాలో 18కి పైగా ప్రాంతాలు
- అనకాపల్లిలో 5...
- పారదర్శక విధానంలో కేటాయింపునకు కమిటీ ఏర్పాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక పాలసీని రూపొందించింది. ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడానికి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రభుత్వ భూములను దీర్ఘకాలిక లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ వ్యవహారం పారదర్శకంగా జరగడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ అధ్యక్షతన మరో ఎనిమిది మందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో గల ప్రభుత్వ భూముల్లో పర్యాటక అభివృద్ధికి ఉపయోగపడే వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ)కి అప్పగించింది. ఔత్సాహికులు ఎవరైనా సరే ఏపీటీఏకి దరఖాస్తు చేస్తే, వాటిని కమిటీ పరిశీలించి భూముల కేటాయింపునకు సిఫారసు చేస్తుంది. విశాఖపట్నంలో జిల్లాలో 18 ప్రాంతాలు, అనకాపల్లి జిల్లాలో ఐదు ప్రదేశాలు లీజుకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ఎటువంటి ప్రాజెక్టులంటే..?

పర్యాటకులను ఆకర్షించేలా, ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడేలా, ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రాజెక్టులు ఉండాలి. భూమిని తీసుకున్న వారు మౌలిక వసతులు అభివృద్ధి చేయాలి. హోటళ్లు, రిసార్ట్, వెల్‌నెస్ సెంటర్లు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు, మైస్ సౌకర్యం (చిన్న చిన్న సమావేశాలు, సభలు నిర్వహించుకునేలా) కల్పించేలా ప్రాజెక్టులు రూపొందించాలి. పెట్టుబడి మొత్తం వారే పెట్టుకోవాలి. ప్రాజెక్టును బట్టి ఎంత కాలం భూమిని లీజుకు ఇవ్వాలనేది కమిటీ నిర్ణయిస్తుంది. ఇవన్నీ పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనే చేపడతారు. భూ కేటాయింపునకు ప్రత్యేక పాలసీ రూపొందించారు. రాయితీలు కూడా పాలసీలో పొందుపరిచారు. లార్జ్, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.



ఎండాడలో పర్యాటక శాఖకు అప్పగించిన భూములు

జిల్లాలో ఎక్కడెక్కడంటే...?

- మధురవాడ సర్వే నంబరు 426/పిలో 10 ఎకరాలు.
- భీమిలి మండలం కొత్తవలసలో 102/2, 103లలో 15 ఎకరాలు
- ఎండాడ సర్వే నంబరు 187లో 17 ఎకరాలు.
- భీమిలి మండలం చేపలుప్పాడ సర్వే నంబరు 53/2ఏలో 2.44 ఎకరాలు.
- ఆనందపురం మండలం దబ్బంద, ఆనందపురం సర్వే నంబర్లు 130/7, 131/1, 131/2, 131/4లలో 7.15 ఎకరాలు
- భీమిలి మండలం కాపులుప్పాడ సర్వే నంబర్లు 392/2, 393/3, 394/2లలో 40 ఎకరాలు
- భీమిలి మండలం నేరెళ్లవలస సర్వే నంబర్లు 96, 121/2, 122/2లలో 11.65 ఎకరాలు
- విశాఖపట్నం వాల్తేరు వార్డు టౌన్ సర్వే నంబరు 1012లో 1.26 ఎకరాలు
- విశాఖ గ్రామీణ

... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

- 29 వరకూ నామినేషన్ల స్వీకరణ
- వచ్చే నెల ఆరున పోలింగ్

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): **జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్‌తో పాటు ఓటర్ల జాబితాను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో అతికించారు.**



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వచ్చే నెల ఆరున జరిగే ఎన్నిక కోసం సోమవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ప్రస్తుత స్టాండింగ్ కమిటీ పదవీ కాలం వచ్చే నెల ఆరో తేదీతో ముగియనున్నది. ఆలోగానే కొత్త కమిటీ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది.

స్టాండింగ్ కమిటీలో పది మంది సభ్యులను 97 మంది కార్పొరేటర్లు బ్యాలెట్ విధానంలో ఎన్నుకుంటారు. సోమవారం నుంచి 29వ తేదీ వరకూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ (జనరల్) కార్యాలయంలో నామినేషన్ పత్రాలు అందుబాటులో ఉంచుతున్నట్టు కమిషనర్ తెలిపారు. పూర్తిచేసిన నామినేషన్ పత్రాలను 29వ తేదీ వరకూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ అదనపు కమిషనర్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. 30న నామినేషన్ పత్రాలను పరిశీలించి, అర్హులైనవారి జాబితాను ప్రదర్శిస్తామన్నారు. రెండో తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. ఆదేరోజు తుది జాబితాను నోటీసుబోర్డులో ప్రదర్శించి, ఆరో తేదీ ఉదయం పది నుంచి రెండు గంటల వరకు పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు.

ఏయూలో క్వాంటం కంప్యూటింగ్

ఈఏపీసెట్ ద్వారా ప్రవేశాలు

ఈ ఏడాది నుంచే ప్రారంభం



ఏయూ సెనేట్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

- మొదటి సంవత్సరం 30 మందికి అవకాశం
- ఆమోదం తెలిపిన అకడమిక్ సెనేట్
- ఎంటెక్ అట్మాస్పియరిక్ సైన్స్, ఎంటెక్ ఓషియానిక్ సైన్స్ కోర్సులు పునఃప్రారంభం
- దూరవిద్య పీజీ కోర్సులకు సెమిస్టర్ విధానంలో పరీక్షలు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): **ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీటెక్ క్వాంటం కంప్యూటింగ్ కోర్సు నిర్వహణకు సెనేట్ ఆమోదం తెలిపింది. సోమవారం ఉదయం జరిగిన సెనేట్ సమావేశంలో నూతన కోర్సు ప్రారంభానికి సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశాలను ఈఏపీసెట్ ద్వారా కల్పించనున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో ఈ కోర్సు నిర్వహించనున్నారు.**

తొలి బ్యాచ్‌లో 30 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ కోర్సుకు సంబంధించిన సబ్జెక్టులను కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, ఇనుస్ట్రుమెంటేషన్, ఈసీఈ తదితర విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు బోధించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటుచేయాలని భావిస్తున్న తరుణంలో దేశవ్యాప్తంగా అతికొద్ది విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న ఈ కోర్సును ఏయూలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే,

... మిగతా 6వ పేజీలో

పెచ్చుమీరుతున్న రౌడీషీటర్ల ఆగడాలు

కత్తులు జేబులో పెట్టుకుని సంచారం

అర్ధరాత్రి వేళ హల్‌చల్

- గుంపులుగా చేరి మద్యం, గంజాయి సేవనం
- మత్తులో విచక్షణ కోల్పోయి కత్తులతో స్వైర విహారం
- ముకుతాడు వేయడంలో విఫలమవుతున్న పోలీసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



ఈనెల 13న డాబాగార్డెన్స్ వద్ద అర్ధరాత్రి సమయంలో రెండు గ్యాంగ్‌ల మధ్య గొడవ జరిగింది. కత్తులతో దాడి చేసుకోవడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.

ఈనెల 17న కంచరపాలెం ప్రాంతానికి చెందిన మూర్తిపై పెందుర్తికి చెందిన రౌడీషీటర్ నగల్ల సాయి అర్ధరాత్రి మద్యం మత్తులో కత్తితో దాడి చేశాడు. ఇద్దరూ మద్యం సేవిస్తుండగా మాటామాటా పెరగడంతో సాయి కత్తితో దాడికి పాల్పడ్డాడని పోలీసులు తేల్చారు.

నగరంలో రౌడీషీటర్ల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. రోడ్లపై గుంపులుగా చేరి మద్యం, గంజాయి సేవిస్తూ కత్తులు పట్టుకుని హల్‌చల్ చేస్తున్నారు. రౌడీగ్యాంగ్‌ల మధ్య కొట్లాటలు సాధారణంగా మారిపోయాయి. అర్ధరాత్రివేళ నడిరోడ్డుపై నిలబడి... ఆ దారిని వెళుతున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మరికొందరు గంజాయి సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. గాజువాక బీసీ రోడ్డులో అల్లరిమూకలు రోడ్డుపై అల్లరి చేస్తుండడంతో ఎదురుగా ఉన్న ఇంటి యజమాని అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పి, వెనుతిరిగారు. దానిని సహించలేని అల్లరిమూకలు అర్ధరాత్రి గోడ దూకి ఆయన ఇంట్లోకి వెళ్లి విధ్వంసం సృష్టించారు. రైల్వే న్యూకాలనీలో ఇద్దరు వ్యక్తులు ఇనుపరాడ్లు, కత్తులతో దాడి చేసుకోవడం స్థానికులను ఆందోళనకు గురిచేసింది. అర్ధరాత్రి బైక్‌లపై తిరుగుతూ వీరంగం సృష్టిస్తున్న వారి సంఖ్యా ఎక్కువగానే ఉంది.

స్పందించని పోలీసులు

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాల్సిన పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు పోలీస్ స్టేషన్లలో మొక్కుబడిగా కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల

... మిగతా 6వ పేజీలో

52 మందితో బీజేపీ జిల్లా కమిటీ

- ఇద్దరు ప్రధాన కార్యదర్శులు
- ఆరుగురు ఉపాధ్యక్షులు
- ఏడుగురు కార్యదర్శులు



విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సోమవారం 52 మందితో విశాఖ జిల్లా కమిటీని ప్రకటించింది. పార్టీ జిల్లా అధ్యక్షునిగా పరశురామ రాజు వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా సిరసపల్లి నూకరాజు, దాడి పురుషోత్తమ రమేశ్‌లను నియమించారు. ఉపాధ్యక్షులుగా చల్లా మంజుల, అత్తిలి శంకరరావు, జేవీ కైలాస్‌రెడ్డి, తాళాడ గిరిజ, కొక్కిలిగడ్డ విజయ బాబు, కలిదిండి బదరీనాథ్‌లను, కార్యదర్శులుగా కంటుభుక్త సునీత, బిడిషా బోయెడ్, లక్కరాజు సోమరాజు, కరాల మహేశ్, జోగా గోవింద్ యాదవ్, కె.పద్మ, లెంకా శ్రీరామ్‌లను నియమించారు. జిల్లా కోశాధికారిగా ఉపాధ్యాయ శేషలత, సోషల్ మీడియా కన్వీనర్‌గా గొంజిపల్లి రాకేశ్‌ను, ఐటీ సెల్ కన్వీనర్‌గా కోనారి ప్రసాద్ యాదవ్‌ను నియమించారు. వీరు కాకుండా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మరో 31 మందిని నియమించింది. జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు ప్రాధాన్యం కల్పించామని పరశురామరాజు ప్రకటనలో తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ సెల్ చల్



పెరుగుతున్న వినియోగదారులు

గడిచిన ఏడాదిలో సుమారు 90 వేల మంది కొత్త కస్టమర్లు చేరిక

- ప్రైవేటు సంస్థల నుంచి మార్పు
- నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకునే దిశగా ప్రభుత్వ సంస్థ చర్యలు
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా 620 టవర్లు ఏర్పాటు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెలా వందలాది మంది కొత్తగా నెట్‌వర్క్‌లో చేరుతున్నారు. గడిచిన ఏడాది ప్రైవేటు టెలికాం సంస్థలు టారిఫ్‌ను భారీగా పెంచడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపిస్తున్నారు.**

గడిచిన కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో బీఎస్ ఎన్ఎల్‌కు 5,28,000 మంది వినియోగ దారులు ఉన్నారు. అందులో 4.7 లక్షల మంది సెల్ కస్టమర్లు. ఏడాది కాలంలో సుమారు 90 వేల మంది కొత్తగా చేరారు. ఇందులో ఇతర నెట్ వర్క్‌ల నుంచి వచ్చినవారు సుమారు 70 వేల మంది వరకూ ఉన్నట్టు అధికారులు చెబు తున్నారు. అత్యధికంగా జియో వినియోగ దారులు ఉన్నారు. ఆ తరువాత స్థానంలో ఎయిర్‌టెల్, వీఐ నెట్‌వర్క్‌లకు చెందిన వినియోగదారులు ఉన్నారు.

నెట్‌వర్క్‌ను విస్తరించే చర్యలు

దేశంలో ఫోన్, ఇంటర్‌నెట్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపట్టింది. ప్రైవేటు టెలికాం సంస్థలు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు టవర్లు ఏర్పాటుచేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేకచోట్ల ప్రైవేటు టెలికాం సంస్థలు టవర్స్‌ను ఏర్పాటు చేశాయి. కాగా, ఫోన్, ఇంటర్‌నెట్ సదుపాయాలను మారు మూల ప్రాంతాలకు అందించేందుకు 'ప్రాజెక్టు 4జి శాచ్యురేషన్' పేరుతో బీఎస్ఎన్ఎల్‌కు కీలక ప్రాజెక్టు అప్పగించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో బీఎస్ఎన్ఎల్ కొత్తగా 620 టవర్లు ఏర్పాటు

... మిగతా 6వ పేజీలో

రేషన్ డీలర్ల నుంచి వసూళ్లు

- కార్డుకు రూ.2 నుంచి రూ.3 రూపాయలు డిమాండ్ చేస్తున్న పౌర సరఫరాల శాఖ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల నుంచి పౌర సరఫరాల శాఖకు చెందిన కొంతమంది చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. నగరంలోని సర్కిల్-1, సర్కిల్-3 పరిధిలో సొమ్ములు వసూలు చేస్తున్నట్టు కొందరు డీలర్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి, కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో గత నెల నుంచి రేషన్ డిపోల్లోనే కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీలర్ల నుంచి నెలవారీ మామూళ్లకు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు తెరలేపారు. డిపో పరిధిలోని కార్డుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని రెండు నుంచి మూడు రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారని మంత్రికి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

భద్రయ్యపేటలో భారీగా కిడ్నీ బాధితులు

- గ్రామంలో 250 మంది నివాసం
- సుమారు 50 మందికి వ్యాధి నిర్ధారణ!?
- వైద్య సహాయం కోసం కలెక్టర్‌కు బాధితుల విన్నపం



కలెక్టరేట్ వద్ద భద్రయ్యపేటకు చెందిన కిడ్నీ బాధితులు

మహారాణిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల (కిడ్నీ) వ్యాధి నుంచి తమను కాపాడాలని పద్మనాభం మండలం భద్రయ్యపేటకు చెందిన పలువురు సోమవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను వేడుకున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...భద్రయ్యపేటలో సుమారు 250 మంది నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా కొందరికి కాళ్లు, ముఖం వాచాయి. వైద్య పరీక్షలలో వారికి మూత్రపిండాల వ్యాధి (కిడ్నీ)గా నిర్ధారణ అయ్యింది. దీంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఆ లక్షణాలు ఉన్న సుమారు 160 మందికి పరీక్షలు నిర్వహించగా 50 మంది వ్యాధి బారినపడినట్టు తేలింది. తదుపరి చికిత్స కోసం కేజీహెచ్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు. బాధితుల్లో స్త్రీ, పురుషులు ఉన్నారు. కేజీహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న అనంతరం ఆ నివేదికలతో కలెక్టర్ కార్యాలయానికి వచ్చి తమ ఆరోగ్య పరిస్థితిని వివరించి, వైద్య సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఇంతమందికి వ్యాధి రావడానికి గల కారణాలేమిటన్నది పరిశీలన చేయించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

కిరండూల్ మార్గంలో రైళ్ల గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్‌లో ఈ నెల 26 వరకు కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతోపాటు గమ్యాలను కుదించి కోరాపుట్ వరకే నడపనున్నట్టు విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 23 నుంచి 25 వరకూ విశాఖలో బయలుదేరి కోరాపుట్ వెళుతుంది. ఇదే ఎక్స్‌ప్రెస్ (18516) ఈ నెల 24 నుంచి 26 వరకు కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కోరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈ నెల 23 నుంచి 26 వరకు విశాఖలో బయలుదేరి కోరాపుట్ వెళుతుంది. ఇదే పాసింజర్ (58502) 23 నుంచి 26 వరకూ కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది.

మునిసిపల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంపు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మునిసిపల్ శాఖలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న నాన్ పీహెచ్ వర్కర్లకు వేతనాలను పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కేటగిరీ-1 వర్కర్ల వేతనం రూ.21,500 నుంచి రూ.24,500కి, కేటగిరీ-2 వర్కర్ల వేతనం రూ.18,500 నుంచి రూ.21,500కి, కేటగిరి-3 వర్కర్ల వేతనం రూ.15 వేల నుంచి రూ.18,500కి పెంచుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనిపై జీవీఎంసీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్ల సంఘం అధ్యక్షుడు ఎం.ఆనందరావు స్పందిస్తూ కేటగిరీల వారీగా జీతాలు పెంచడం ఆహ్వానించదగ్గపరిణామమే కానీ, సమ్మె కాలానికి వేతనాలు చెల్లింపు, పీఆర్‌సీ అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింపు డిమాండ్లను పరిగణనలోకి తీసుకోలేదని, వాటి పరిష్కారానికి కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.


అనంతవరం జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

పద్మనాభంలో భారీ వర్షం

పద్మనాభం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం వరకూ ఎండ ఉండగా 12 గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సుమారు గంటన్నర పాటు పడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. వర్షం వరి నారు మడులకు జీవం పోస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సింహగిరి గ్రామ దేవతల పండగ

సింహాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి సోదరీమణులు, సింహగిరి గ్రామస్తుల ఆరాధ్య దేవతలు ఉమా మహేశ్వరీ పాదాలమ్మ, పుట్టి బంగారమ్మ వార్షిక పండగ మంగళవారం జరగనుంది. ఈమేరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సింహాచలం దేవస్థానం ఈఓ త్రినాథరావు ఆదేశాల మేరకు అలయ పరిసరాలను శుభ్రపరిచారు.

98వ వార్డులో రూ.39 కోట్లతో పనులు

సింహాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులోని మైత్రీనగర్, పద్మావతినగర్‌లో రూ. 39 కోట్ల జీవీఎంసీ సాధారణ నిధులతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని కార్పొరేటర్ పివి నరసింహం తెలిపారు. సోమవారం ఆయన ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

ఎంఈఓ శ్రీనివాసరావుకు సన్మానం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం (రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డొకర శ్రీనివాసరావు భీమిలి ఎంఈఓగా నియామకం కావడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం కె. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బుడుమూరి సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రసాదరావు, తారకేశ్వరరావు, చంద్రమౌళి, గంగరాజు, విద్యా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, గోపాలరావు, అప్పలరాజు , తదితరులు పాల్గొన్నారు.

సింహాచలనగర్‌లో 'తొలి అడుగు'


కరపత్రాలు పంచుతున్న కార్పొరేటర్ పీవీ నరసింహం, నేతలు

సింహాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఎంతో మంచి చేసిందని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం అన్నారు. సోమవారం ఆయన సింహాచలనగర్ (చాకిరేవుకొండ)లో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో మాట్లాడారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సం క్షేమ పథకాలను వివరించి, కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు నిమ్మకాయల నూకరాజు, కాలనీ నాయకులు కోరాడ కృష్ణప్రసాద్, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐదో వార్డులోని సమస్యలపై వినతి

కొమ్మాది, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని ఐదో వార్డులో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ మొల్లి హేమలత కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వార్డులోని రాజీవ్‌గృహకల్ప, హుద్‌హుద్ కాలనీల్లో యూజీడీ సమస్యపై వివరించారు. మధురవాడకు యూజీడీ వాహనం కావాలంటే గాజువాక నుంచి తీసుకువస్తున్నారని, మధురవాడకు యూజీడీ వెహికల్ మంజూరు చేయాలని కోరారు. అలాగే 5వ వార్డులోని సచివాలయం 6వ వార్డులో మ్యాపింగ్ కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దగ్గరలోని బోరవానిపాలెంకు మార్చాలని విజ్ఞప్తి చేశారు.

పాండ్రంగిలో రైతులకు ఎరువులు పంపిణీ


రైతులకు ఎరువులు అందిస్తున్న దృశ్యం

పద్మనాభం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పాండ్రంగిలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం రాయితీపై ఎరువులు పంపిణీ చేశారు. ఈ కేంద్రంలో డీఏపీ, యూరియా, పొటాష్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ సహాయకురాలు ఉమాపార్వతి చెప్పారు. రైతుల అభ్యర్థన మేరకు పురుగు మందులు, గడ్డి మందులు కూడా కేంద్రంలో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి సత్యశ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పల్లి మహేష్, టీడీపీ నాయకులు మహంతి అప్పలరమణ, పి. రమణ, సోమునాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పద్మనాభం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం మండల వైసీపీ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు సోదరుడు కోరాడ రామునాయుడు (రాము) నగరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఇటీవల ఆయన చింతలవలస పోలీసు క్వార్టరు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈమేరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రాము మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని పలువురు నాయకులు అతని మృతికి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. కాగా రాము, లక్ష్మణ్ కవలలు కాగా రాము కానిస్టేబుల్‌గా చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్‌లో పని చేస్తున్నారు. లక్ష్మణ్ క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» రుషికొండ బీచ్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలా ఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సాగర్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రుషికొండ బీచ్‌లో స్వచ్ఛభారత్, ఏపీ పర్యాటక శాఖ నిధులు రూ. 55 లక్షలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ అయిదేళ్ల పాలనలో అభివృద్ధి జాడ లేకుండా పోయిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధిపై ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురించాయన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ అటు సంక్షేమానికి, ఇటు అభివృద్ధికి ఇబ్బంది లేకుండా నడిపిస్తున్నామన్నారు. కాగా రుషికొండలో శౌచాలయాలు నిర్మిస్తున్నప్పటికీ సరైన నీటి సౌకర్యం లేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జనసేన నాయకుడు శేఖరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు అక్కరబోయిన రాంబాబు, చెట్టుపల్లి సన్యాసిరావు, బి. దొరబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, లొడగల రామ్మోహన్, ఎరుపల్లి లక్ష్మణ, మంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యపాలెంలో..

మధురవాడ : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన ఏడో వార్డులోని మల్లయ్యపాలెంలో రూ. 99 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, పార్కు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ అయిదేళ్ల పాలనలో అభివృద్ధి జాడ లేదని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురించాయని చెప్పారు. అనంతరం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్సీ కనక మహాలక్ష్మి, ఏపీటీడీసీ ఇన్‌చార్జి జగదీశ్, టూరిజం జిల్లా అధికారి మాధవి, కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, పిల్లా వెంకట్రావు, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, గోరే గురునాథ్, నాగోతి సత్యనారాయణ, మామిడి దుర్గారావు పాల్గొన్నారు.

కార్మికుల భద్రత పరిశ్రమల బాధ్యత

- రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌వర్మ


మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌వర్మ

భీమునిపట్నం (రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా కార్మికులు పనిచేసే చోట భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డి. చంద్రశేఖర్‌వర్మ సూచించారు. సోమవారం ఆయన చిప్పాడ దివీస్ కర్మాగారంలో జరిగిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల భద్రత విషయంలో రాజీపడకుండా అత్యంత ఆధునిక యంత్రాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. పనికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో పని చేసే ప్రదేశంలో కార్మికుల భద్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ ముఖ్య ఇన్‌స్పెక్టర్ జె. శివశంకరరెడ్డి మాట్లాడుతూ భద్రతా చర్యలు బాగుంటే ప్రమాదాలు జరగవని, ఒకవేళ జరిగినా ఎటువంటి నష్టం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి. సురేశ్, దివీస్ డైరెక్టర్ ఎస్. దేవేందరరావు, ఉపాధ్యక్షుడు ఎల్‌వీ రమణ, సేఫ్టీ విభాగం అధికారి చంద్రశేఖర్ జనరల్ మేనేజర్లు కోటేశ్వరరావు, కె. సుబ్బారావు, రమేష్‌బాబు, రామకృష్ణ, ఎల్. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ అప్పలనాయుడు, తదితరులు

పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పద్మనాభం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. పర్సన్ ఇన్‌ఛార్జిగా మొకర అప్పలనాయుడు (అన్నమయ్య), డైరెక్టర్లుగా కిలారి రమణ, కొండపల్లి నారాయణ వ్రుడుతో సొసైటీ సీఈఓ కె. కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లీలావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ రామస్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ ప్రీమియం చెల్లిస్తాం'

మహారాణిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌లో జర్నలిస్టు ప్రీమియం చెల్లింపునకు సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ఏడాది పాటు పొడిగించిందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో జర్నలిస్టు సంఘం నాయకులు పి.సత్యనారాయణ, ఆర్.రామచంద్రరావు, కె.పరశురామ్, ఎం. కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మొబైల్స్, ట్యాప్‌టాప్‌లు

కలెక్టరేట్‌లో ఐదుగురు దివ్యాంగులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ సోమవారం పలు ఉపకరణాలు అందజేశారు. ఇందులో నాలుగు మొబైల్ టచ్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ ఉన్నాయి.

వేధింపులపై సచివాలయ ఉద్యోగిని ఫిర్యాదు

రాజకీయ కారణాలతో తనను వేధిస్తున్నారని పాయకరావుపేట సచివాలయంలోని వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న రెడ్డి సాధన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నవారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

రోడ్డు సదుపాయం కల్పించాలని ధర్నా

కొమ్మాది, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాదిలోని కె1, కె2 కాలనీల ప్రజలు తమకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జోన్-2 కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మధురవాడ జోన్ అధ్యక్షుడు డి. అప్పలరాజు మాట్లాడుతూ రెండు కాలనీల ప్రజలు రహదారి సమస్యపై కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారని చెప్పారు. బక్కన్నపాలెం మీదుగా రూపొందించిన మాస్టర్ ప్లాన్ రహదారి నవోదయ విద్యాలయం వద్ద కొంత భాగం తనదని, ఈ కేసు కోర్టులో ఉందని ఓ వ్యక్తి రోడ్డుని మూసివేశారని, దీనిపై ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాలనీవాసులకు ఇదే ప్రధాన మార్గం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం జడ్సీ కనకమహాలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి. రాజ్‌కుమార్, మధురవాడ దళిత సంఘాల నాయకులు సియాద్రి కనకరాజు, కాలనీవాసులు అవతార్‌సింగ్, చిన్న, వాసంతి, ఎండీ హుస్సేన్ పాల్గొన్నారు.

తీరంలో రక్షణ గోడ నిర్మించాలి


జడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

భీమునిపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తీర ప్రాంతం కోతకు గురవకుండా రక్షణ గోడ నిర్మించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. సోమవారం జోనల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన జడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీచ్‌రోడ్‌లో పోలమాంబ ఆలయం నుంచి బోయవీధి, తోటవీధి వరకూ తీరం కోతకు గురవుతుందన్నారు. తుఫాన్లు వచ్చినా, భారీ వర్షాలు కురిసినా తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. అక్కడ తక్షణమే రక్షణ గోడ నిర్మించాలన్నారు. కాగా పీజీఆర్ఎస్‌కు మొత్తం 13 అర్జీలు రాగా యూసీడీ విభాగానికి 2, పట్టణ ప్రణాళిక విభాగానికి 2, ఇంజనీరింగ్ విభాగానికి 9 వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు.

గీతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కోర్సులు

సాగర్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పలు కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని వర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు తెలిపారు. నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు దీక్షా రంభ్ పేరిట సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల్లో మార్పులు చేస్తూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచుతున్నామన్నారు. ఈమేరకు పలు ఐటీ, ఔషధ పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. అలాగే కేంద్రం నూతన విద్యా విధానానికి అనుగుణంగా యూజీ స్థాయి విద్యార్థులను పరిశోధనలకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాపణిపప్పు స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ వేదవతి, అకడమిక్ ఎఫైర్స్ డీన్ రాధిక, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సత్యదేవ్, పాల్గొన్నారు.


పీఎంపాలెంలో ఎస్ఎఫ్ఐ ఆందోళన

కొమ్మాది, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం సాంకేతిక కళాశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. కళాశాల పని వేళలు మార్చాలని గత గురువారం సాంకేతిక కళాశాలల విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ధర్నా చేసిన విషయం తెలిసిందే. పోలీసులు విద్యార్థులను వారించి కళాశాల యాజమాన్యంతో మాట్లాడడంతో సోమవారం వరకు గడువు ఇవ్వాలని కోరారు. సోమవారం కళాశాలకు వచ్చిన విద్యార్థులు పని వేళల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడంతో నిరాశకు లోనయ్యారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి కళాశాల ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ఈ విషయం పీఎంపాలెం పోలీసులకు తెలియడంతో వారు ఎస్ఎఫ్ఐ నాయకులను ఆందోళన విరమించాలని కోరారు. తాము శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నామని వారు చెప్పగా పోలీసులు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారించడంతో 11 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా కళాశాల ప్రతినిధులు మధ్యాహ్నం విద్యార్థులతో చర్చలు జరిపారు. మంగళవారం నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కళాశాల నిర్వహిస్తామని ఏఓ నాగేశ్వరరావు చెప్పారు.

తాతినాయుడు ఎన్నిక పట్ల హర్షం

భీమునిపట్నం (రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన అయ్యప్ప సేవా పీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యదర్శిగా నియమితులయ్యారు. తమిళనాడులోని తిరువణ్ణామలైలో ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన సమావేశంలో అయ్యప్ప సేవా కార్యక్రమాలు చేస్తున్న భక్తులతో ఎన్నికలు నిర్వహించారు. ఈమేరకు తాతినాయుడు రెండేళ్ల కాల పరిమితికి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తాతినాయుడును గ్రామానికి చెందిన పలువురు అభినందించారు.

శ్రీపద సంకీర్తన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ద్వారం త్యాగరాజు, తదితరులు

సీతంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సోమవారం సహృదయ సాహితి సంస్థ, జగత్కళ్యాణ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో రాజయోగి వెంకటపతి స్వామి రచించిన శ్రీపద సంకీర్తన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కనకమహాలక్ష్మి సంకీర్తన గానలహరి కార్యక్రమాన్ని ద్వారం మ్యూజిక్ అకాడమి, త్యాగరాజ శిష్య బృందం నిర్వహించారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ద్వారం వీకేజీ త్యాగరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావ్యాలు మూడు రకాలంటూ, నారికేళ పాకం, కదళీ పాకం, ద్రాక్ష పాకంతో పోల్చారు. సంకీర్తనలను రచించిన రాజయోగి వెంకటపతి స్వామిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆధ్యాత్మికవేత్త మరడాన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూలో క్వాంటం కంప్యూటింగ్

(5వ పేజీ తరువాయి)

మెటీరియాలజీ ఓషనోగ్రఫీ విభాగం నుంచి గతంలో నిర్వహించి నిలిపివేసిన ఎంటెక్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఎంటెక్ ఓషియానిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి పునఃప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

మరిన్ని నిర్ణయాలు

సెనేట్ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏయూ దూర విద్యా కేంద్రం నుంచి నిర్వహిస్తున్న పీజీ కోర్సులకు సంబంధించి వార్షిక పరీక్షల స్థానంలో సెమిస్టర్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. సైన్స్ కళాశాల పరిధిలో పలు విభాగాల్లో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల నిర్వహణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా మెరైన్ లివింగ్ రీసోర్స్ విభాగం పరిధిలో ఏడాది కాల వ్యవధితో ఆక్వా కల్చర్‌లో పీజీ డిప్లమో కోర్సును నిర్వహించడానికి ఆమోదముద్ర వేశారు. ఏయూ చిత్రకళా విభాగం, థియేటర్ ఆర్ట్స్ విభాగాలను సమన్వయం చేస్తూ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఏర్పాటుచేయాలని మాజీ ఉప కులపతులు కొందరు సూచించారు. ఏయూ శతాబ్ది వేడుకలను జరుపుకుంటున్న తరుణంలో ప్రత్యేక గ్రాంటును అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలని పాలక మండలి సభ్యులు, పూర్వ ఉపకులపతులు సూచించారు. దీనిపై ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేశామని, త్వరలో సమగ్ర ప్రతిపాదనలతో లేఖలు రాయనున్నట్టు వెల్లడించారు. ఏయూ సాధించిన ప్రగతిని, విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను, పూర్వ విద్యార్థులతో అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, మాజీ వీసీలు ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, బీలా సత్యనారాయణ; జీఎస్ఎన్ రాజు, జి.నాగేశ్వరరావు, వీవీజీడీ ప్రసాదరెడ్డి, పాలక మండలి సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ చైర్మన్లు, అకడమిక్ సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

పెచ్చుమీరుతున్న రౌడీషీటర్ల ఆగడాలు

(5వ పేజీ తరువాయి)

ఫలితం ఉండడం లేదు. కత్తులతో తిరిగినా, దాడి చేసినా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారనే భయం రౌడీషీటర్లలో లేకుండా పోయింది. వీధుల్లో ఆకతాయిలు వాహనాలతో వీరంగం సృష్టించడం, దారిన వచ్చిపోయే యువతులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం చేస్తున్నారు. అటువంటి వారిపై పోలీసులు నిఘా పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. సరైన కారణంగా లేకుండా అర్ధరాత్రి రోడ్లపై గుంపులుగా తిరిగే వారిని స్టేషన్‌కు తరలించాలని, ఆ దిశగా పోలీసులు దృష్టిపెట్టాలంటున్నారు.

పర్యాటక శాఖ భూములు లీజుకు...

(5వ పేజీ తరువాయి)

మండలం ఎండాడ సర్వే నంబరు 113/5లో 31 సెంట్లు.

- ఎండాడలో సర్వే నంబరు 187లో 3 ఎకరాలు.
- రుషికొండ సర్వే నంబరు 38లో 8.44 ఎకరాలు.
- రామానాయుడు స్టూడియో సమీపాన సర్వే నం. 426/2లో 5 ఎకరాలు
- భీమిలి మండలం అన్నవరం ఎల్‌పీ నం.1356, 1360లలో 17.25 ఎకరాలు
- ఎండాడ సర్వే నంబర్లు 106/1, 106/4లలో 2.33 ఎకరాలు
- గాజువాక మండలం యారాడ సర్వే నంబరు 53/పిలో 5 ఎకరాలు
- నేరెళ్లవలస సర్వే నంబరు 126లో 1.70 ఎకరాలు
- కాపులుప్పాడ సర్వే నం.284/3, 287/4, 287/5, 288/2లలో 17.42 ఎకరాలు
- ఎండాడలో సర్వే నంబర్లు 183, 184, 185లో 9 సెంట్లు
- అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి మండలం న్యాయంపూడి సర్వే నంబరు 80/2లో 1.17 ఎకరాలు
- పరవాడ ముత్యాలమ్మపాలెం సర్వేనం 324/2లో 12.52 ఎకరాలు
- అచ్యుతాపురం మండలం పూడిమడక సర్వే నం 85/3లో 2.58 ఎకరాలు
- ఎస్.రాయవరం మండలం గుడివాడ (రేవుపోలవరం) సర్వే నంబరు 380లో 5 ఎకరాలు
- అనకాపల్లి మండలం శంకరంలో 150, 143, 144, 154 సర్వే నంబర్లలో 1.4 ఎకరాలు
- అల్లూరి జిల్లా అనంతగిరి మండలం నందకోట సర్వే నంబర్లు 22, 28లలో 43.1 ఎకరాలు

బీఎస్ఎన్ఎల్ సెల్ చల్

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి ఉంది. విశాఖ జిల్లాలో ఎనిమిది, అనకాపల్లి జిల్లాలో 41, అల్లూరి జిల్లాలో 571 టవర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటికే 416 టవర్లు ఏర్పాటు చేశారు. మిగిలిన టవర్లు ఏర్పాటుచేయడానికి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. మెటీరియల్ తీసుకు వెళ్లేందుకు అనువైన మార్గాలు లేక ఏజెన్సీ ప్రాంతంలో ఈ పనులు ముందుకు సాగడం లేదంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో బీఎస్ ఎన్ఎల్ వినియోగదారులు 6,18,000 మంది ఉన్నారు. ఇందులో 5.4 లక్షల మంది ప్రీ పెయిడ్, 42 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియోగదారులు ఉన్నారు. మరో 36 వేల మంది ల్యాండ్ లైన్ వినియోగదారులు.

జోరుగా గెడ్డ ఇసుక అమ్మకాలు

భీమునిపట్నం (రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇసుక కొరత ఏర్పడడంతో చాలామంది గెడల్లో కొట్టుకువచ్చిన ఇసుకతో నిర్మాణాలు సాగిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ 1500 ఉండడంతో చిన్న చిన్న నిర్మాణాలకు ఈ ఇసుకను వినియోగిస్తున్నారు. ఏటి ప్రాంతాలు, గెడ్డల్లో వర్షాలు కురిసిన తర్వాత కొట్టుకువచ్చిన ఇసుకను బస్తాలతో సేకరించి వివిధ ప్రాంతాల్లో కుప్పలుగా చేస్తుంటారు. వాటిని తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మండలంలోని చిప్పాడ, తాటితూరు నగరపాలెం. దాకమర్రి ప్రాంతాల్లో ఇటువంటి ఇసుక పాయింట్లు నిర్వహిస్తున్నారు. నది ఇసుక కావాలంటే చాలా తతంగం ఉండడం, తక్కువ ధరకు లభించకపోవడంతో ఎక్కువ మంది గెడ్డల్లోని ఇసుకపై ఆధారపడుతున్నారు.

తాటిపూడి నీరు విడుదల చేయాలి

భీమునిపట్నం (రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో 18 కిలోమీటర్ల మేర ప్రవహించే గోస్తనీ నదిలో నీరు అడుగంటిపోయింది. దీంతో నది పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్లు ఎండిపోయాయి. నది పక్కన బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నది అనంతగిరి కొండల్లో పుట్టి, విజయనగరం జిల్లా ఎస్. కోట మండలం తాటిపూడి వద్ద రిజర్వాయర్‌లో కలుస్తుంది. అక్కడి నుంచి పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లో ప్రవహించి భీమిలి వద్ద సముద్రంలో కలుస్తుంది. రిజర్వాయర్‌లో తగినంత నీరు లేకపోతే నదిలో కూడా నీరు ఉండదు. విజయనగరం, విశాఖ జిల్లాల కలెక్టర్లు సంయుక్తంగా నిర్ణయం తీసుకుని రిజర్వాయరులో నీటిని ఆరు నెలలకు ఒకసారి విడుదల చేస్తుంటారు. అప్పుడు మాత్రమే నదిలో నీరు నిండుగా ప్రవహిస్తుంది. ప్రస్తుతం నదిలో నీరు చిన్న పాయ మాదిరిగా ఉంది. నీరు తగినంత లేకపోవడంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆకతాయిల వికృత చేష్టలు

అక్కయ్యపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల వికృత చేష్టలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల పరిసరాల్లో వీరి బెడద ఎక్కువైంది. పాఠశాల వద్ద విచ్చలవిడిగా తిరుగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పాఠశాల తెరిచినప్పటి నుంచి బైక్‌లతో గేటు ఎదుట చక్కర్లు కొడుతున్నారు. విద్యార్థినులతో ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

25 నుంచి గ్రీన్ సిటీలో శ్రావణ లక్ష్మి పూజలు

ఆటోనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ గ్రీన్ సిటీలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈ నెల 25 నుంచి ఆగస్టు 28వ తేదీ వరకు శ్రావణ మాసాన్ని పురస్కరిం చుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావులు పేర్కొన్నారు. 25న శ్రావణ మాసం మొదటి శుక్రవారం ఐశ్వర్య మహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకాలు, సహస్రనామార్చన ఉంటాయన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ పార్కుకు ఎదురుగా ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇసుకలారీ డివైడర్‌ను ఢీకొంది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు అడివివరం నుంచి హనుమంతవాక జంక్షన్ వైపు వెళ్తున్న ఇసుక లారీ ముడసర్లోవ వైపు వస్తుండగా బ్రేకు పట్టకపోవడంతో డ్రైవర్ లారీని డివైడర్ పైకి ఎక్కించాడు. డివైడర్‌తో పాటు అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఈ ప్రమాదం ఉదయం 7.30 గంటల సమయంలో జరగడంతో వాహనాల సంచారం పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నిరంతరం వెలుగులు



వెలిగి ఉన్న వీధి లైట్

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ ప్రాంతంలోని పలు వీధులలో రాత్రింబవళ్లు పలు వీధుల్లో విద్యుత్ లైట్లు వెలుగుతున్నాయి. వాటిని ఆపే నాథుడు కరువయ్యాడు. సుమారు వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. విద్యుత్ వృధా కాకుండా అధికారులు చర్య తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన



స్వర్ణ పుష్పాల మధ్య స్వామివారు

సింహాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వా మికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ తులసీ దళార్చన సోమవారం వైభ వంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీదేవి, భూదేవి సమేతంగా శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యా హవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం వైభ వంగా నిర్వహించారు.

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడి, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 33, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 24, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 32, బీరకాయలు 28, ఆనపకాయ 16,కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 28, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42,బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 46, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



అధ్వానంగా ఉన్న కాలనీలోని పార్కు



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



రోడ్లను ఆక్రమించి వాహనాల పార్కింగ్

జగన్నాథరాజు కాలనీలో సమస్యల తిష్ఠ

- ఒకప్పుడు పరిశుభ్రతకు నిలయం
- ప్రస్తుతం అధ్వాన స్థితికి చిరునామా

వెంకోజీపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడు దశాబ్దాల క్రితం వరకు రాజుగారి తోటలా పిలుస్తూ, ఎటువంటి అభివృద్ధి లేకుండా పిచ్చిమొక్కలు, అడవిని తలపించేలా ఉండే కాలనీ క్రమేణా నివాసులు పెరిగి, పెద్ద పెద్ద అపార్టుమెంట్‌లు వచ్చి రాజుగారి తోట కాస్త జగన్నాథరాజు నివాసుల సంక్షేమ సంఘం కాలనీ (జేఆర్‌డబ్ల్యుఏ)గా మారింది. అప్పటి నుంచి కాలనీలో వివిధ అభివృద్ధి పనులను కాలనీ వాసులే చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో కాలనీని సుందరంగా తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొని కాలనీలోని చెత్తాచెదారాన్ని తొలగించేవారు. కాలనీ ప్రారంభంలో బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, దాని చుట్టూ ఇనుపకంచె వేసి బుద్ధ పార్కుగా మార్చారు. అక్కడి స్థలం కోసం కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో దానికి ప్రహరీ నిర్మించకుండా, ఫెన్సింగ్ మాత్రం జీవీఎంసీతో వేయించారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా కాలనీ పెద్దలు చొరవ చూపేవారు. అయితే వారు వృద్ధులు కావడంతో కాలనీ పరిశుభ్రతపై చొరవ చూపలేక అధ్వానంగా తయారైంది. క్రమంగా ఆకతాయిలకు నిలయంగా మారింది. రోడ్లను ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. పార్కుగా భావించే స్థలం చుట్టూ ఫెన్సింగ్‌ను ఆకతాయిలు తొలగించారు. శివాలయం వైపు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారులు చెత్తాచెదారం వేయడంతో ఈప్రాంతం అధ్వానంగా మారిపోయిందని స్థానికులు వాపోతున్నారు. కాలనీకి ఆనుకుని హైవే బస్టాప్ వద్ద విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే ప్రయాణికులు తమ వాహనాలను కాలనీ రోడ్డులో పార్కింగ్ చేయడమే కాకుండా, కొంతమంది రోజుల తరబడి అక్కడే వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఫెన్సింగ్ విరగ్గొట్టి మరీ వ్యాపారం

రాత్రి వేళ లైట్లు లేక ఖాళీ స్థలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ నివాసితులకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. బుద్ధ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బల్లలపై సేద తీరేందుకు వచ్చిన వృద్ధులు ఆకతాయి చేష్టలకు చికాకు పడుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి, కాలనీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కోరుతున్నారు.

ఇళ్లపై నీళ్ల ట్యాంకులను శుభ్రపరచండి : కమిషనర్

వెంకోజీపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రతినిత్యం క్లోరిన్ కలిపి నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించిన అనంతరమే ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తోందని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న వ్యక్తిగత గృహాలు, బహుళ గృహ సముదాయాలు, హౌసింగ్ బోర్డు కాలనీ, రాజీవ్ గృహ సముదాయం, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయం, కమర్షియల్ భవనాలపై నీటిని నిలువ చేసుకునే సింటెక్స్ ట్యాంకులు, కాంక్రీట్ వాల్స్ లేదా ఇటుకలతో నిర్మించిన ట్యాంకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి శుభ్రపరచుకుంటూ తప్పనిసరిగా పటిష్టమైన మూతలు అమర్చాలని కమిషనర్ సూచించారు. నీటి ద్వారా కలరా, డయేరియా, గ్యాస్ట్రోఎంటరాలజీ లాంటి వ్యాధులు సంక్రమించకుండా వివిధ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో తమ ఇళ్ల సమీపంలో ఎక్కడైనా రక్షిత తాగునీటి పైపులైన్ల లీకులు, మురికి కాలువలపై లీకులు గమనిస్తే తక్షణమే ఆయా జోనల్ కమిషనర్, ఎమినిటీ వార్డు కార్యదర్శులు, నీటి సరఫరా సహాయ ఇంజనీరు, సిటీ ఆపరేషన్ సెంటర్(సీఓసీ) కు తగిన సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. తాగునీటి పైపులైనుకు సంబంధించి ఎటువంటి సమస్య అయినా ప్రజలు తెలియపరిచేందుకు జీవీఎంసీలో సిటీ ఆపరేషన్ సెంటర్(సీఓసీ) 24 గంటలూ పని చేస్తుందని, అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెంబరు 18004 2500009 ద్వారా లేదా 0891-2507225 ఫోన్ నెంబరు ద్వారా తెలియపరచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఇష్టారాజ్యంగా పడివేసిన డెకరేటింగ్ సామగ్రి, కర్రలు

ఇలా ఉంటే వ్యాధులు ప్రబలవా?

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 13వ వార్డు ఆఖరి బస్టాపు సమీపంలోనూ, శివాలయానికి దగ్గరలో ప్రజల దాహార్తిని తీర్చే నీళ్ల ట్యాంకు అపరిశుభ్ర వాతావరణంలో ఉంది. ఈ ట్యాంకు చుట్టూ అలంకరణ సామగ్రి, కర్రలు పోగుచేశారు. పశువులను అక్కడే ఉంచడంతో ఆ ప్రాంతం దుర్గంధభరితంగా, దోమలకు నిలయంగా మారింది. దీనికి చేరువలో పాఠశాల, సచివాలయం కూడా ఉన్నాయి. విద్యార్థులకు దోమలు కుడితే అనారోగ్య పరిస్థితులతో ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఇక్కడ సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజానీకం కూడా సతమతమవుతున్నారు. డెకరేటింగ్ సామగ్రి నిర్వాహకుడు ఇక్కడ కొన్ని దారులను మూసేసి తన సామగ్రిని నిల్వ చేసుకున్నాడు. దీంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. నీళ్లట్యాంకు వద్దకు రావడానికి కూడా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాధులు ప్రబలడానికి అవకాశం లేని విధంగా ఈ పరిసరాలు మెరుగుపరచాలని, ఆక్రమణలు తొలగించి రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.



వాటర్ టాంక్ సమీపంలో బురద



అశోక్‌ను సత్కరిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

అశోక్‌ను కలిసిన ప్రణవ్‌గోపాల్

సిరిపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గోవా గవర్నర్‌గా నియమితులైన సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజును ఆయన నివాసంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వీఎంఆర్డీఏ చేపట్టిన బృహత్తర ప్రణాళికపై అశోక్ పలు సూచనలు చేశారు. విజయనగరంలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కలిసి చర్చించారు.

సామాజిక భవనాలు నిర్మించాలని వినతి

రామ్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : బానోజీనగర్‌లోని పలు సమస్యలపై 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి దుర్గారావు సోమవారం జీవీఎంసీలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. బానోజీనగర్ పితాని వీధుల్లో ఉన్న సులాభ్ కాంప్లెక్సులు నిరుపయోగంగా ఉండడంతో పలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి సులాభ్ కాంప్లెక్సును తొలగించి వాటి స్థానంలో సావజిక భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు.

'అక్రమాల్లో వైసీపీ రికార్డు'

భీమునిపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భూములు, మద్యం అక్రమాల్లో గత వైసీపీ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే మద్యం పాలసీని రద్దు చేసి ఆ పార్టీ బడా నాయకులకు అనుకూలంగా నూతన పాలసీని తీసుకు వచ్చిందని తెలిపారు. సిట్ విచారణలో వెలుగుచూస్తున్న మద్యం కుంభకోణంలో నిజాలు, కోర్టు మెట్లు ఎక్కుతున్న అప్పటి ప్రభుత్వ పెద్ద లను చూస్తే ఎన్ని అక్రమాలు జరిగాయో అర్థమవుతుందన్నారు. మద్యం దుకాణాల ముందు ఉపాధ్యాయులను కాపలా పెట్టి, వచ్చిన రాబడితో బినామీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టారన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు

పెందుర్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఇంట్లో వారు చదువుకోమని మందలించడంతో అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలికను తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చారు. సీఐ కేవీ సతీశ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేశపాత్రునిపాలేనికి చెందిన బాలికను ఇంట్లో వాళ్లు చదువుకోవాలని చెప్పడంతో ఈనెల 17న అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బాలిక ఆచూకీ కోసం నగరంలో వెతికారు. ఈ క్రమంలో సోమవారం రైల్వేస్టేషన్ వద్ద బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

వెల్ఫేర్ హోమ్ నుంచి ఇంటికి

ఇంటి నుంచి పారిపోయి వేపగుంట జంక్షన్‌లో అనాథలా తిరుగుతున్న బాలికను పెందుర్తి పోలీసులు ఈనెల 13న నగరంలోని చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. అనంతరం బాలిక వివరాలు సేకరించిగా ఎస్. కోట మండలం కాశీపురానికి చెందినదిగా నిర్ధారణ చేశారు. సోమవారం బాలికను బంధువులకు అప్పగించారు. ఈ మధ్య కాలంలో తల్లిండ్రులు మందలించారని పిల్లలు ఇంటి నుంచి పారిపోతున్నారని,అసలే రోజులు బాగా లేవని పోలీసులు తెలిపారు. పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

అస్తవ్యస్తంగా అబ్దుల్ కలామ్ పార్కు

- ఏళ్ల తరబడి నిర్వహణ కరువు
- పశువుల సంచారంతో భయం భయం

వెంకోజీపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల ఆట పాటలతో.. వృద్ధుల కబుర్లతో.. యువకుల వ్యాయామాలతో ఆహ్లాదకరంగా ఉండాల్సిన పార్కు ఆవుల సంచారంతో.. వాటి మురుగుతో అస్తవ్యస్తంగా మారింది. ఉదయాన్నే కరాటే శిక్షణకు వస్తున్న విద్యార్థులు, షెటిల్ ఆడేందుకు వస్తున్న యువకులు పార్కులో తొలుత గోమూత్రాలను ఎత్తే దుస్థితి నెలకొంది. ఒకప్పుడు ఈ పార్కుకు ఒక ప్రధాన గేటు, ఒక చిన్న గేటు ఉండేవి. ఈ గేట్లను మూసివేసి ఆవులు రాకుండా కొంతవరకు ఆటగాళ్లు , పార్కుకు వచ్చేవారు అరికట్టేవారు. కానీ కొద్ది రోజుల క్రితం చిన్న గేటు వద్ద గోడ పగిలి గేటు పడిపోయింది. మరోవైపు భారీ వృక్షం నేల కొరిగి గోడ విరిగిపోయింది. దీంతో ప్రధాన గేటు మూసివేసినా మిగిలిన రెండు మార్గాల మీదుగా ఆవులు పార్కు లోపలికి ప్రవేశిస్తున్నాయి. ఇది 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలామ్ యూజర్స్ అండ్ రిక్రియేషన్ పార్కు దుస్థితి. ఇక్కడి స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఖాళీ స్థలం ఇప్పటికే గోవులతో నిండిపోయింది. ఇది చాలదన్నట్టు పశువుల పెంపకందారులు పార్కులను కూడా వదలడం లేదు. రోజూ పాలు పితికిన తరువాత గోవులను తిరిగేందుకు పార్కులోకి వదిలేస్తున్నారు. దీంతో పార్కు మొత్తం ఆవు పేడలతో నిండిపోతుంది. రోజూ ఇక్కడికి వచ్చే ఆటగాళ్లు, కరాటే శిక్షణ పొందే చిన్నారులు పేడలను ఎత్తుకునే పరిస్థితి నెలకొంది.



పేడ ఎత్తుతున్న కరాటే క్రీడాకారులు



కూలిపోయిన ప్రహరీ గోడ

పట్టించుకోని పాలకులు

టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2018-19లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో పార్కులో వాకింగ్ ట్రాక్, బోరు, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, రెండు గేట్లు ఏర్పాటు చేశారు. 2019 తరువాత వైసీపీ ప్రభుత్వం రావడం, ఆ తరువాత జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీకి చెందిన మొల్లి లక్ష్మి కార్పొరేటర్‌గా గెలవడం జరిగింది. కార్పొరేటర్‌గా పదవి చేపట్టి ఐదేళ్లు పూర్తవుతున్నా.. వార్డులో కనీసం ఒక్క పార్కు కూడా అభివృద్ధి చేసిన పుణ్యానికి పోలేదు. అబ్దుల్ కలాం పార్కు కనీస నిర్వహణ కూడా నోచుకోలేదు. గతంలో ఈ పార్కులో ఏకంగా సచివాలయం భవన నిర్మాణానికి అప్పటి మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో శంకుస్థాపన కూడా చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంలో ఆ ప్రక్రియను నిలిపివేశారు. కానీ పార్కు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు.



రామకృష్ణాపురంలో కబ్జా చేసిన స్థలంలో వేసిన పాక

ఆక్రమణలో ప్రభుత్వ స్థలం

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధికి చెందిన 13వ వార్డులోని రామకృష్ణాపురం ఆక్రమణలకు నిలయంగా మారింది. బీఆర్‌టీఎస్ రోడ్డుకు సమీపంలోని రామకృష్ణాపురం చివరి భాగాన సుమారు 600 గజాల స్థలం ఆక్రమణకు గురైంది. అక్కడ చిన్న పాకలు వెలిశాయి. కారు నిలిపేందుకు ఒక షెడ్డు కూడా వేశారు. ఈ కబ్జా వెనుక సచివాలయ సిబ్బంది సహకారం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. అడిగేవారు లేక ఇక్కడ షెడ్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారని చెబుతున్నారు. తాను అధికార టీడీపీ మద్దతుదారును కావడంతో ఎవరూ ఏమీ చేయలేరని కబ్జాదారుడు చెబుతున్నాడని అంటున్నారు. ఈయన చెప్పిందే వేదంగా సాగుతున్న ఇక్కడ ఆక్రమణ స్థలాలపై జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు దృష్టి సారించాలని అందరూ కోరుతున్నారు.

సర్వీసు రోడ్డులో రేకుల షెడ్



సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన రేకుల షెడ్

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధికి చెందిన 10వ వార్డులోని ఆదర్శనగర్ హైవేలో గల పెట్రోలు బంకు నుంచి ఇందిరానగర్ వైపు వెళ్తున్న సర్వీసు రోడ్డు ఆక్రమణకు గురైంది. ఈరోడ్డులో సర్వీసు రోడ్డుకు ఆనుకుని ఇటీవల ఒక షెడ్డు వేశారు. ఇందులో వాహనాలు పార్కు చేస్తున్నారు. దీని వెనుక ఓ మెకానిక్ గ్యారేజీ కూడా ఉంది. ఇలా రోడ్డును ఆక్రమించి షెడ్డు వేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్యాపకులు మంచి రచనలు చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ అధ్యాపకుడు మంచి రచనలు చేసి సమాజానికి అందివ్వాలని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు సూచించారు. భీమిలి ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి రచించిన 'విమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ సెల్ఫ్ గ్రూప్స్' పుస్తకాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే అధ్యాపకులు తమ విజ్ఞానంతో రచనలు చేయవలసిన అవసరముందన్నారు. నిరంతర విద్యార్థిగా ఆకళింపు చేసుకున్న విషయాలను పుస్తకాలుగా రూపొందిస్తే చాలా రచనలు సమాజానికి అందుతాయన్నారు. ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ మాట్లాడుతూ విష్ణుమూర్తి స్ఫూర్తితో అందరు అధ్యాపకులు పుస్తకాలు ప్రచురించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, జి. లక్ష్మణరావు, వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లపై మురుగు నీటి ప్రవాహం



పద్మనాభంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పద్మనాభం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రోడ్లపై చెత్త లేకుండా చేయడం,కాలువల్లో పూడికలు తీయడం,రోడ్లపై వాడుక నీరు పారకుండా చేయడం వంటి పనులు చేపట్టాల్సి ఉండగా కేవలం మండల కార్యాలయాల వద్ద రోడ్లు తుడిచి, మానవహారాలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. పద్మనాభంలోని అనంతపద్మనాభుని మెట్ల మార్గం అంతా మురుగు నీరు పారుతోంది. కొండను మెట్లమార్గం ద్వారా అధిరోహించే భక్తులు, నారాయణేశ్వర ఆలయాన్ని దర్శించుకోవడానికి వచ్చే వారు మురుగునీటిని తొక్కుకుని వెళ్తున్నారు. పద్మనాభంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారితో పాటు పద్మనాభంలోకి వెళ్లే ప్రధాన రోడ్డుపైనే నిత్యం మురుగునీరు పారుతోంది. కాలువల్లో చెత్త పేరుకుపోయి, దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ ప్రీమియం చెల్లింపునకు కలెక్టర్ హామీ

మహారాణిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌లో జర్నలిస్టు ప్రీమియం చెల్లింపునకు సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ఏడాది పాటు పొడిగించిందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జర్నలిస్టు సంఘం నాయకులు పి.సత్యనారాయణ, ఆర్.రామచంద్రరావు, కె.పరశురామ్, ఎం.కమల్‌కుమార్ ఉన్నారు.

దివ్యాంగులకు మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు

కలెక్టరేట్‌లో ఐదుగురు దివ్యాంగులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్‌లు సోమవారం పలు ఉప కరణాలు అందజేశారు. ఇందులో నాలుగు మొబైల్ టచ్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ ఉన్నాయి.

వేధింపులపై సచివాలయ ఉద్యోగిని ఫిర్యాదు

రాజకీయ కారణాలతో తనను వేధిస్తున్నారని పాయకరావుపేట సచివాలయంలోని వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న రెడ్డి సాధన అనే ఉద్యోగిని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నవారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

శాకంబరిగా పార్వతీదేవి



సీతమ్మధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ మాస పూజల్లో భాగంగా సోమవారం మహా శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీదేవిని పలు రకాల కూరగాయలతో శాకంబరి రూపంలో అలంకరించారు. అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మలు వేద మంత్రాలు పఠించారు.

గ్రంథాలయానికి పుస్తకాల విరాళం



పుస్తకాల్ని అందిస్తున్న రవీంద్రనాథ్

మురళీనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్‌లోని మహిళలు, పిల్లల ప్రత్యేక శాఖా గ్రంథాలయానికి ఓ దాత 28 పుస్తకాల్ని విరాళమిచ్చారు. గాయత్రి విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ జె.రవీంద్రనాథ్ సోమవారం గ్రంథాలయానికి పుస్తకాలతో వచ్చి లైబ్రేరియన్‌కు అందించారు. యువత, పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు మరింతగా పెరగాలని రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పుస్తకమే మనకు అన్నీ నేర్పుతుందన్నారు. యువత, బాలలు హాజరయ్యారు.

బడ్డీల తొలగింపు



ఏఎంజీ ఆసుపత్రి రోడ్డులో తొలగిస్తున్న బడ్డీ

సీతమ్మధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందడంతో నక్కవానిపాలెం ఏఎంజీ ఆసుపత్రి రోడ్డులో రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను, మెకానిక్ దుకాణాలను సోమవారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఆ రోడ్డులో ప్రజలకు శబ్ద కాలుష్యంతోపాటు రోడ్డును ఆక్రమించి వాహనాలు నిలిపి మరమ్మతులు చేస్తున్న ఓ దుకాణాన్ని కూడా తొలగించారు.

సుపరిపాలనలో తొలి అడుగుపై టీడీపీ నాయకుల ప్రచారం



గృహిణికి కరపత్రం అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు సింగాలమ్మపురం, వాసుదేవనగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైలా ముత్యాలనాయుడు, వాసుపల్లి రాజు, మధుసూదన్, నరేంద్ర, రామిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణ ఇలాగేనా?

- బాధ్యులకు నోటీసులివ్వండి
- రైల్వే అధికారుల నుంచి రూ.15 కోట్ల ఆస్తిపన్ను బకాయి వసూలుకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
- రైల్వేస్టేషన్ నుంచి తాటిచెట్లపాలెం వరకు తనిఖీలు



అధికారులకు సూచనలు చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

అక్కయ్యపాలెం/జ్ఞానాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ నుంచి తాటిచెట్లపాలెం వరకు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో శుభ్రత లేకపోవడాన్ని గమనించి వ్యర్థాల తొలగింపులో అలసత్వం చూపిన రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రతా లోపాలపై రైల్వే యాజమాన్యానికి వెంటనే నోటీసులు జారీ చేయాలని జోనల్ కమిషనర్ రామును ఆదేశించారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ కౌంటర్, జనరల్ టికెట్ కౌంటర్, కారు పార్కింగ్, ఆటో స్టాండ్, వీఐపీ పార్కింగ్ తదితర ప్రాంతాలు పరిశీలించి అక్కడి పారిశుధ్య పరిస్థితిపై అధికారులను ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు ఎన్ని గంటలు విధుల్లో ఉంటున్నారు? రోజుకు ఎన్ని ట్రిప్పుల్లో వ్యర్థాలు తరలిస్తున్నారు? అనే విషయాలను కమిషనర్ తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాల్లో చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి మైక్‌ద్వారా అవగాహన కల్పించే ప్రకటనలు, బోర్డులు ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. మలేరియా, డెంగ్యూ జ్వరాల వ్యాప్తిని నివారించేందుకు పిచికారీ, ఫాగింగ్ పనులను వారానికి మూడుసార్లు నిర్వహించాలన్నారు. ప్రజా మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శులదేనని స్పష్టంచేశారు. మార్గంమధ్యలోని సెంట్రల్ మీడియన్‌లో పచ్చదనం లోపాన్ని గమనించి ఉద్యాన అధికారికి నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే చెట్ల మొదళ్లకు గ్రిల్స్ ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో అస్తవ్యస్తంగా ఉన్న బడ్డీలు, టిఫిన్ సెంటర్లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. రైల్వే అధికారుల నుంచి రూ.15 కోట్ల ఆస్తిపన్ను బకాయి వసూలుకు తక్షణమే నోటీసులు జారీ చేసి రాబట్టాలని కమిషనర్ ఆదేశించారు. అధికారులు దిలీప్, పళనికుమార్, అర్చన, జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా శారీ వాక్



సంప్రదాయ శారీవాక్‌లో పాల్గొన్న యువతులు

డాబాగార్డెన్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మిస్ అండ్ మిసెస్ శ్రావణలక్ష్మి శారీవాక్‌లో పాల్గొన్న మహిళలు తమదైన హావాభావాలు ప్రదర్శిస్తూ ర్యాంప్‌వాక్‌పై అలరించారు. క్వీన్స్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో సంప్రదాయ శారీవాక్‌లో మహిళలు, యువతులు ఆద్యంతం సందడి చేశారు. పరికిణీ...ఓణీలతో తెలుగు సంస్కృతిని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పేడాడ రమణికుమారి, పీలా వెంకటలక్ష్మి, శ్రీదేవి, సత్యనారాయణ, మోదవలస ఉషారాణి హాజరయ్యారు. మిసెస్ శ్రావణలక్ష్మి విభాగంలో శారీవాక్ చేసిన అనంతరం లక్ష్మీదేవి, శ్రావణ మాసం, పసుపు, కుంకుమ, తాంబూలం తదితర అంశాల విశిష్టతలను మహిళలు ఒక్కొక్కరిగా వివరించారు. పోటీలకు సంగీత, మాధురి, నక్షత్ర, భాగ్యలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మిసెస్ క్యాటగిరీలో మనీషా, మిస్ కేటగిరీలో తన్వీ సుచరిత విజేతలుగా నిలిచారు. విరోనికా, వెన్నెల, బిందుశ్రీ, దివ్య కిషోర్, రేష్మ, దివ్య రాజేష్ రన్నర్‌లుగా ఎంపికయ్యారు. విజేతలను అతిథులు అభినందించారు.

విద్యార్థుల ఆధార్ అప్‌డేట్‌కు చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి గొండు సీతారాం సూచన

అక్కయ్యపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో 15 ఏళ్లు దాటిన విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేసే కేంద్రాలు ఏర్పాటు విధానానికి కొత్త టెక్నాలజీతో చర్యలు చేపట్టి బాలల హక్కులను పరిరక్షించాలని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, యూఐడీఏఐ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారికి ఇటీవల లేఖలు రాసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏడేళ్లు దాటిన పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడం తప్పనిసరి చేసిందన్నారు. ఈ ఆదేశాలతో రాష్ట్రంలో అయిదు నుంచి ఏడేళ్ల మధ్య పిల్లల ఆధార్ అప్‌డేట్‌కు ముందుకు రాకపోవడం తల్లిదండ్రుల అవగాహనలేమి తెలియజేస్తుందన్నారు. లక్షలాది మంది పిల్లలు, విద్యార్థులు వివిధ స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు.

ఆకతాయిల వికృత చేష్టలు

అక్కయ్యపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల వికృత చేష్టలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల పరిసరాల్లో వీరి బెడద ఎక్కువైంది. పాఠశాల వద్ద విచ్చలవిడిగా తిరుగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పాఠశాల తెరిచినప్పటి నుంచి బైక్‌లతో గేటు ఎదుట చక్కర్లు కొడుతున్నారు. విద్యార్థినులతో ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రశ్నించే వారిని దుర్భాషలాడుతూ దాడికి దిగుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలకు విచ్చేస్తున్న విద్యార్థినులు ఆకతాయి చేష్టలకు భయాందోళన చెందుతున్నారు. ఆకతాయిలకు చెక్ పెట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇటీవల ఓ విద్యార్థిపై ఆకతాయిలు దాడి చేసేందుకు ప్రయత్నించారని, స్థానికులు కేకలు వేయడంతో పారిపోయారని పలువురు చెబుతున్నారు.

శ్రీపద సంకీర్తన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ద్వారం త్యాగరాజు, ఇతర ప్రముఖులు

సీతంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సోమవారం సహృదయ సాహితి సంస్థ, జగత్కళ్యాణ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో రాజయోగి వెంకటపతి స్వామి రచించిన శ్రీపద సంకీర్తన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కనకమహాలక్ష్మి సంకీర్తన గానలహరి కార్యక్రమాన్ని ద్వారం మ్యూజిక్ అకాడమి, త్యాగరాజ శిష్య బృందం నిర్వహించారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ద్వారం వీకేజీ త్యాగరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావ్యాలు మూడు రకాలంటూ, నారికేళ పాకం, కదళీ పాకం, ద్రాక్ష పాకంతో పోల్చారు. సంకీర్తనలను రచించిన రాజయోగి వెంకటపతి స్వామిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆధ్యాత్మికవేత్త మరడాన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో వినతుల స్వీకరణ

సీతమ్మధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ కోర్టు పనులనిమిత్తం వెళ్లడంతో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాల మంజూరు కోసం దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

మాధవధార, కంచరపాలెంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



మాధవధార ఉడాకాలనీలో కల్వర్టు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయరు పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తదితరులు



కస్తూరినగర్‌లో నూతన భవనాన్ని ఆరంభిస్తున్న మేయరు, ఎమ్మెల్యే

మాధవధార/కంచరపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాధవధార, కంచరపాలెం ప్రాంతాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులను నగర మేయరు పీలా శ్రీనివాసరావుతో కలసి విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. మరికొన్ని కొత్త పనులకు భూమి పూజ చేశారు. గ్రేటర్ 46వవార్డు కంచరపాలెం పరిధిలోని కస్తూరినగర్, లక్ష్మీనారాయణపురం ప్రాంతాల్లో రూ.90 లక్షలతో నిర్మాణం చేపట్టిన కొత్త సామాజిక భవనాల్ని ఆరంభించారు. మేయరు పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజులు రిబ్బన్ కట్ చేసి కొత్త భవనాల్ని ప్రజోపయోగ పనులకు, సామాజిక వినియోగానికి అప్పగించారు. మాధవధార కళింగనగర్‌లో రూ.60 లక్షలతో నూతన డ్రైనేజీ కట్టడాలు, సీసీరోడ్లు, మాధవధార ఉడాకాలనీ గెడ్డపై కొత్త కల్వర్టు నిర్మాణాలకు భూమిపూజ చేసి, శిలాఫలకాల్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గ సమన్వకర్త పి.ఉషాకిరణ్, ఎస్.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయరు కె.సతీష్, 51వవార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ, బీజేపీ ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ సురేష్ బాబు, 51వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.కీర్తి, 43, 46 వార్డుల బీజేపీ, టీడీపీ అధ్యక్షులు గారా ఈశ్వరరావు, రఘునాథ్, పుక్కళ్ళ పైడికొండ, నాయకులు శ్యామలా దీపిక, రాగతి రమణమ్మ, సురేష్‌బాబు, శంకర్ పాల్గొన్నారు.

పి-4 సర్వేను సమగ్రంగా చేపట్టాలి: వరప్రసాద్



మాధవధారలో గ్రామసభలో సత్కారం పొందిన సచివాలయ సెక్రటరీలతో ఎస్.వరప్రసాద్

మాధవధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాధవధార బృందావన్ పార్కు వద్ద సచివాలయంలో సోమవారం పి-4 సర్వేకి సంబంధించి గ్రామసభ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది క్షుణ్ణంగా సర్వే చేపట్టాలని వరప్రసాద్ సూచించారు. అట్టడుగున ఉన్న కుటుంబాల్ని గుర్తించి, జాబితాల్ని ప్రదర్శిస్తారని అన్నారు. 50వవార్డు పరిధిలోని సచివాలయాల నుంచి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న కార్యదర్శులను వరప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డులోని యూసీడీ రిసోర్స్ పర్సన్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కోర్సులు

సాగర్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పలు కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని వర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు తెలిపారు. నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు దీక్షా రంబ్ పేరిట సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల్లో మార్పులు చేస్తూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచుతున్నామన్నారు. పలు ఐటీ, ఔషధ పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. యూజీ స్థాయి విద్యార్థులను పరిశోధనలకు ప్రోత్సహిస్తున్నామన్నారు.

సచివాలయాల్లో సర్టిఫికెట్లు అందక విద్యార్థుల ఆందోళన

- బదిలీపై వెళ్లిన ఉద్యోగులు విధుల్లో చేరక అవస్థలు

మహారాణిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల నుంచి విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్‌లు అందక అవకాశాలు కోల్పోతున్నామని తీవ్ర ఆందోళన చెందున్నారు. విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జూన్, జూలై నెలలు ఎంతో కీలకం. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర వాటిలో చేరేందుకు కీలకమైన సమయమిది. ప్రధానంగా విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని చేరబోతున్న విద్యాసంస్థల్లో సమర్పించవలసి ఉంటుంది. తద్వారా వారికి రిజర్వేషన్ కేటగిరీలను పరిగణనలోకి తీసుకొని సీట్లు కేటాయిస్తారు. ఇందుకోసం విద్యార్థులు ఇప్పటికే వార్డు సచివాలయాలు, మండల కార్యాలయాల్లో తమకు కావలసిన సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. దీనితో సచివాలయ ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. అందులో కొందరు తమ చోటు నుంచి రిలీవ్ కాలేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇంకా జాయిన్ కాలేదు. జాయిన్ అయినా సెలవుపై వెళ్లిపోయి పూర్తిగా విధులు చేపట్టలేదు. దీనితో విద్యార్థులకు సచివాలయం నుంచి జారీ కావలసిన సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. కళాశాలల్లో వాటిని సమర్పించ లేకపోవటంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని కోర్సులకు ఆఖరు తేదీలు ముగిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కార్యాలయాలలో అన్ని సంతకాలు పూర్తి అయినా సచివాలయ ఉద్యోగులు పూర్తి స్థాయిలో విధుల్లోకి చేరకపోవటంతో ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పరిణామాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తమకు ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు జారీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సర్టిఫికెట్లు సమర్పించే గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హరిత సోయగానికి చర్యలు



హైవే రోడ్డులో మొక్కల్ని ఆకృతిగా కట్ జేస్తున్న కార్మికులు

మాధవధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగర పచ్చదనాన్ని మరింత ఇనుమడింపజేసేలా శనివారం హైవే రోడ్లలో మొక్కల సుందరీకరణ పనులు ఆరంభించారు. నాలుగు వరుసల హైవే దారుల్లో మొక్కలను క్రమపద్ధతిలో కటింగ్ చేసి నగర రహదారుల్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తున్నారు. ప్రధాన కారిడార్‌లోనూ, సర్వీసు రోడ్డు చివర డివైడరులో పలు రకాల పూల మొక్కల్ని, హైబ్రీడ్ రకాలను ఆకర్షణీయంగా కట్ చేశారు. ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు ఉన్న ప్రధాన కూడళ్లు, ఆర్అండ్‌బీ, ఊర్వశి జంక్షన్, బిర్లా జంక్షన్ ప్రాంతాల్లోని గ్రీనరీ ప్రాంతాలను క్రమబద్ధీకరించారు. జీవీఎంసీ ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగం అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు.

కార్మికుల భద్రత పరిశ్రమల బాధ్యత

- రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌వర్మ



మాట్లాడుతున్న చంద్రశేఖరవర్మ

భీమునిపట్నం (రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా కార్మికులు పనిచేసే చోట భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డి. చంద్రశేఖర్‌వర్మ సూచిం చారు. సోమవారం ఆయన చిప్పాడ దివీస్ కర్మాగారంలో జరిగిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల భద్రత విషయంలో రాజీపడకుండా అత్యంత ఆధునిక యంత్రాలను అందుబాటులో ఉంచా లని చెప్పారు. పనికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో పని చేసే ప్రదేశంలో కార్మికుల భద్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ ముఖ్య ఇన్‌స్పెక్టర్ జె. శివశంకరరెడ్డి మాట్లాడుతూ భద్రతా చర్యలు బాగుంటే ప్రమాదాలు జరగవని, ఒకవేళ జరిగినా ఎటువంటి నష్టం ఉండదన్నారు. పలువురు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఏయూలో క్వాంటం కంప్యూటింగ్

(5వ పేజీ తరువాయి)

మెటీరియాలజీ ఓషనోగ్రఫీ విభాగం నుంచి గతంలో నిర్వహించి నిలిపివేసిన ఎంటెక్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఎంటెక్ ఓషియానిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి పునఃప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

మరిన్ని నిర్ణయాలు

సెనేట్ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏయూ దూర విద్యా కేంద్రం నుంచి నిర్వహిస్తున్న పీజీ కోర్సులకు సంబంధించి వార్షిక పరీక్షల స్థానంలో సెమిస్టర్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. సైన్స్ కళాశాల పరిధిలో పలు విభాగాల్లో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల నిర్వహణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా మెరైన్ లివింగ్ రీసోర్స్ విభాగం పరిధిలో ఏడాది కాల వ్యవధితో ఆక్వా కల్చర్‌లో పీజీ డిప్లమో కోర్సును నిర్వహించడానికి ఆమోదముద్ర వేశారు. ఏయూ చిత్రకళా విభాగం, థియేటర్ ఆర్ట్స్ విభాగాలను సమన్వయం చేస్తూ స్కూల్ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ ఏర్పాటుచేయాలని మాజీ ఉప కులపతులు కొందరు సూచించారు. ఏయూ శతాబ్ది వేడుకలను జరుపుకుంటున్న తరుణంలో ప్రత్యేక గ్రాంటును అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలని పాలక మండలి సభ్యులు, పూర్వ ఉపకులపతులు సూచించారు. దీనిపై ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేశామని, త్వరలో సమగ్ర ప్రతిపాదనలతో లేఖలు రాయనున్నట్టు వెల్లడించారు. ఏయూ సాధించిన ప్రగతిని, విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను, పూర్వ విద్యార్థులతో అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, మాజీ వీసీలు ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, బీలా సత్యనారాయణ, జీఎస్ఎన్ రాజు, జి.నాగేశ్వరరావు, పీవీజీడీ ప్రసాదరెడ్డి, పాలక మండలి సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ ఛైర్మన్లు, అకడమిక్ సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

పెచ్చుమీరుతున్న రౌడీషీటర్ల ఆగడాలు

(5వ పేజీ తరువాయి)

ఫలితం ఉండడం లేదు. కత్తులతో తిరిగినా, దాడి చేసినా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారనే భయం రౌడీషీటర్లలో లేకుండా పోయింది. వీధుల్లో ఆకతాయిలు వాహనాలతో వీరంగం సృష్టించడం, దారిన వచ్చిపోయే యువతులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం చేస్తున్నారు. అటువంటి వారిపై పోలీసులు నిఘా పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. సరైన కారణంగా లేకుండా అర్ధరాత్రి రోడ్లపై గుంపులుగా తిరిగే వారిని స్టేషన్‌కు తరలించాలని, ఆ దిశగా పోలీసులు దృష్టిపెట్టాలంటున్నారు.

పర్యాటక శాఖ భూములు లీజుకు...

(5వ పేజీ తరువాయి)

మండలం ఎండాడ సర్వే నంబరు 113/5లో 31 సెంట్లు.

- ఎండాడలో సర్వే నంబరు 187లో 3 ఎకరాలు.
- రుషికొండ సర్వే నంబరు 38లో 8.44 ఎకరాలు.
- రామానాయుడు స్టూడియో సమీపాన సర్వే నం. 426/2లో 5 ఎకరాలు
- భీమిలి మండలం అన్నవరం ఎల్‌పీ నం.1356, 1360లలో 17.25 ఎకరాలు
- ఎండాడ సర్వే నంబర్లు 106/1, 106/4లలో 2.33 ఎకరాలు
- గాజువాక మండలం యారాడ సర్వే నంబరు 53/పిలో 5 ఎకరాలు
- నేరెళ్లవలస సర్వే నంబరు 126లో 1.70 ఎకరాలు
- కాపులుప్పాడ సర్వే నం.284/3, 287/4, 287/5, 288/2లలో 17.42 ఎకరాలు
- ఎండాడలో సర్వే నంబర్లు 183, 184, 185లో 9 సెంట్లు
- అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి మండలం న్యాయంపూడి సర్వే నంబరు 80/2లో 1.17 ఎకరాలు
- పరవాడ ముత్యాలమ్మపాలెం సర్వేనం 324/2లో 12.52 ఎకరాలు
- అచ్యుతాపురం మండలం పూడిమడక సర్వే నం 85/3లో 2.58 ఎకరాలు
- ఎస్.రాయవరం మండలం గుడివాడ (రేవుపోలవరం) సర్వే నంబరు 380లో 5 ఎకరాలు
- అనకాపల్లి మండలం శంకరంలో 150, 143, 144, 154 సర్వే నంబర్లలో 1.4 ఎకరాలు
- అల్లూరి జిల్లా అనంతగిరి మండలం నందకోట సర్వే నంబర్లు 22, 28లలో 43.1 ఎకరాలు

బీఎస్ఎన్ఎల్ సెల్‌చల్

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి ఉంది. విశాఖ జిల్లాలో ఎనిమిది, అనకాపల్లి జిల్లాలో 41, అల్లూరి జిల్లాలో 571 టవర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటికే 416 టవర్లు ఏర్పాటు చేశారు. మిగిలిన టవర్లు ఏర్పాటుచేయడానికి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. మెటీరియల్ తీసుకువెళ్లేందుకు అనువైన మార్గాలు లేక ఏజెన్సీ ప్రాంతంలో ఈ పనులు ముందుకు సాగడం లేదంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో బీఎస్ ఎన్ఎల్ వినియోగదారులు 6,18,000 మంది ఉన్నారు. ఇందులో 5.4 లక్షల మంది ప్రీ పెయిడ్, 42 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియోగదారులు ఉన్నారు. మరో 36 వేల మంది ల్యాండ్ లైన్ వినియోగదారులు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ పార్కుకు ఎదురుగా ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇసుకలారీ డివైడర్‌ను ఢీకొంది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు అడివివరం నుంచి హనుమంతవాక జంక్షన్ వైపు వెళ్తున్న ఇసుక లారీ ముడసర్లోవ వైపు వస్తుండగా బ్రేకు పట్టకపోవడంతో డ్రైవర్ లారీని డివైడర్ పైకి ఎక్కించాడు. డివైడర్‌తో పాటు అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఈ ప్రమాదం ఉదయం 7.30 గంటల సమయంలో జరగడంతో వాహనాల సంచారం పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నిరంతరం వెలుగులు



వెలిగి ఉన్న వీధి లైట్

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ ప్రాంతంలోని పలు వీధులలో రాత్రింబవళ్లు పలు వీధుల్లో విద్యుత్ లైట్లు వెలుగుతున్నాయి. వాటిని ఆపే నాథుడు కరువయ్యాడు. సుమారు వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. విద్యుత్ వృధా కాకుండా అధికారులు చర్య తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన



స్వర్ణ పుష్పాల మధ్య స్వామివారు

సింహాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ తులసీ దళార్చన సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీదేవి, భూదేవి సమేతంగా శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడి, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 33, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 24, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 32, బీరకాయలు 28, ఆనపకాయ 16,కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 44, దొండకాయలు 28, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42,బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 46, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



అధ్వానంగా ఉన్న కాలనీలోని పార్కు



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



రోడ్లను ఆక్రమించి వాహనాల పార్కింగ్

జగన్నాథరాజు కాలనీలో సమస్యల తిష్ఠ

- ఒకప్పుడు పరిశుభ్రతకు నిలయం
- ప్రస్తుతం అధ్వాన స్థితికి చిరునామా

వెంకోజీపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడు దశాబ్దాల క్రితం వరకు రాజుగారి తోటలా పిలుస్తూ, ఎటువంటి అభివృద్ధి లేకుండా పిచ్చిమొక్కలు, అడవిని తలపించేలా ఉండే కాలనీ క్రమేణా నివాసులు పెరిగి, పెద్ద పెద్ద అపార్టుమెంట్‌లు వచ్చి రాజుగారి తోట కాస్త జగన్నాథరాజు నివాసుల సంక్షేమ సంఘం కాలనీ (జేఆర్‌డబ్ల్యూఏ)గా మారింది. అప్పటి నుంచి కాలనీలో వివిధ అభివృద్ధి పనులను కాలనీ వాసులే చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో కాలనీని సుందరంగా తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొని కాలనీలోని చెత్తాచెదారాన్ని తొలగించేవారు. కాలనీ ప్రారంభంలో బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, దాని చుట్టూ ఇనుపకంచె వేసి బుద్ధ పార్కుగా మార్చారు. అక్కడి స్థలం కోసం కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో దానికి ప్రహరీ నిర్మించకుండా, ఫెన్సింగ్ మాత్రం జీవీఎంసీతో వేయించారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా కాలనీ పెద్దలు చొరవ చూపేవారు. అయితే వారు వృద్ధులు కావడంతో కాలనీ పరిశుభ్రతపై చొరవ చూపలేక అధ్వానంగా తయారైంది. క్రమంగా ఆకతాయిలకు నిలయంగా మారింది. రోడ్లను ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. పార్కుగా భావించే స్థలం చుట్టూ ఫెన్సింగ్‌ను ఆకతాయిలు తొలగించారు. శివాలయం వైపు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారులు చెత్తాచెదారం వేయడంతో ఈప్రాంతం అధ్వానంగా మారిపోయిందని స్థానికులు వాపోతున్నారు. కాలనీకి ఆనుకుని హైవే బస్టాప్ వద్ద విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే ప్రయాణికులు తమ వాహనాలను కాలనీ రోడ్డులో పార్కింగ్ చేయడమే కాకుండా, కొంతమంది రోజుల తరబడి అక్కడే వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఫెన్సింగ్ విరగ్గొట్టి మరీ వ్యాపారం

రాత్రి వేళ లైట్లు లేక ఖాళీ స్థలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ నివాసితులకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. బుద్ధ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బల్లలపై సేద తీరేందుకు వచ్చిన వృద్ధులు ఆకతాయి చేష్టలకు చికాకు పడుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి, కాలనీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కోరుతున్నారు.

ఇళ్లపై నీళ్ల ట్యాంకులను శుభ్రపరచండి : కమిషనర్

వెంకోజీపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రతినిత్యం క్లోరిన్ కలిపి నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించిన అనంతరమే ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తోందని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న వ్యక్తిగత గృహాలు, బహుళ గృహ సముదాయాలు, హౌసింగ్ బోర్డు కాలనీ, రాజీవ్ గృహ సముదాయం, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయం, కమర్షియల్ భవనాలపై నీటిని నిలువ చేసుకునే సింటెక్స్ ట్యాంకులు, కాంక్రీట్ వాల్స్ లేదా ఇటుకలతో నిర్మించిన ట్యాంకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి శుభ్రపరచుకుంటూ తప్పనిసరిగా పటిష్టమైన మూతలు అమర్చాలని కమిషనర్ సూచించారు. నీటి ద్వారా కలరా, డయేరియా, గ్యాస్ట్రోఎంటరాలజీ లాంటి వ్యాధులు సంక్రమించకుండా వివిధ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో తమ ఇళ్ల సమీపంలో ఎక్కడైనా రక్షిత తాగునీటి పైపులైన్ల లీకులు, మురికి కాలువలపై లీకులు గమనిస్తే తక్షణమే ఆయా జోనల్ కమిషనర్, ఎమినిటీ వార్డు కార్యదర్శులు, నీటి సరఫరా సహాయ ఇంజనీరు, సిటీ ఆపరేషన్ సెంటర్(సీఓసీ) కు తగిన సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. తాగునీటి పైపులైనుకు సంబంధించి ఎటువంటి సమస్య అయినా ప్రజలు తెలియపరిచేందుకు జీవీఎంసీలో సిటీ ఆపరేషన్ సెంటర్(సీఓసీ) 24 గంటలూ పని చేస్తుందని, అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెంబరు 18004 2500009 ద్వారా లేదా 0891-2507225 ఫోన్ నెంబరు ద్వారా తెలియపరచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఇష్టారాజ్యంగా పడివేసిన డెకరేటింగ్ సామగ్రి, కర్రలు

ఇలా ఉంటే వ్యాధులు ప్రబలవా?

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 13వ వార్డు ఆఖరి బస్‌స్టాపు సమీపంలోనూ, శివాలయానికి దగ్గరలో ప్రజల దాహార్తిని తీర్చే నీళ్ల ట్యాంకు అపరిశుభ్ర వాతావరణంలో ఉంది. ఈ ట్యాంకు చుట్టూ అలంకరణ సామగ్రి, కర్రలు పోగుచేశారు. పశువులను అక్కడే ఉంచడంతో ఆ ప్రాంతం దుర్గంధభరితంగా, దోమలకు నిలయంగా మారింది. దీనికి చేరువలో పాఠశాల, సచివాలయం కూడా ఉన్నాయి. విద్యార్థులకు దోమలు కుడితే అనారోగ్య పరిస్థితులతో ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఇక్కడ సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజానీకం కూడా సతమతమవుతున్నారు. డెకరేటింగ్ సామగ్రి నిర్వాహకుడు ఇక్కడ కొన్ని దారులను మూసేసి తన సామగ్రిని నిల్వ చేసుకున్నాడు. దీంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. నీళ్లట్యాంకు వద్దకు రావడానికి కూడా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాధులు ప్రబలడానికి అవకాశం లేని విధంగా ఈ పరిసరాలు మెరుగుపరచాలని, ఆక్రమణలు తొలగించి రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.



వాటర్ టాంక్ సమీపంలో బురద



అశోక్‌ను సత్కరిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

అశోక్‌ను కలిసిన ప్రణవ్‌గోపాల్

సిరిపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గోవా గవర్నర్‌గా నియమితులైన సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజును ఆయన నివాసంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వీఎంఆర్డీఏ చేపట్టిన బృహత్తర ప్రణాళికపై అశోక్ పలు సూచనలు చేశారు. విజయనగరంలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కలిసి చర్చించారు.

సామాజిక భవనాలు నిర్మించాలని వినతి

రామ్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భానోజీనగర్‌లోని పలు సమస్యలపై 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి దుర్గారావు సోమవారం జీవీఎంసీలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. భానోజీనగర్ పితాని వీధుల్లో ఉన్న సులాభ్ కాంప్లెక్స్‌లు నిరుపయోగంగా ఉండడంతో పలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి సులాభ్ కాంప్లెక్సును తొలగించి వాటి స్థానంలో సావజిక భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు.

'అక్రమాల్లో వైసీపీ రికార్డు'

భీమునిపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భూములు, మద్యం అక్రమాల్లో గత వైసీపీ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే మద్యం పాలసీని రద్దు చేసి ఆ పార్టీ బడా నాయకులకు అనుకూలంగా నూతన పాలసీని తీసుకు వచ్చిందని తెలిపారు. సిట్ విచారణలో వెలుగుచూస్తున్న మద్యం కుంభకోణంలో నిజాలు, కోర్టు మెట్లు ఎక్కుతున్న అప్పటి ప్రభుత్వ పెద్ద లను చూస్తే ఎన్ని అక్రమాలు జరిగాయో అర్థమవుతుందన్నారు. మద్యం దుకాణాల ముందు ఉపాధ్యాయులను కాపలా పెట్టి, వచ్చిన రాబడితో బినామీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టారన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు

పెందుర్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఇంట్లో వారు చదువుకోమని మందలించడంతో అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలికను తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చారు. సీఐ కేవీ సతీశ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేశపాత్రునిపాలేనికి చెందిన బాలికను ఇంట్లో వాళ్లు చదువుకోవాలని చెప్పడంతో ఈనెల 17న అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బాలిక ఆచూకీ కోసం నగరంలో వెతికారు. ఈ క్రమంలో సోమవారం రైల్వేస్టేషన్ వద్ద బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

వెల్ఫేర్ హోమ్ నుంచి ఇంటికి

ఇంటి నుంచి పారిపోయి వేపగుంట జంక్షన్‌లో అనాథలా తిరుగుతున్న బాలికను పెందుర్తి పోలీసులు ఈనెల 13న నగరంలోని చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. అనంతరం బాలిక వివరాలు సేకరించిగా ఎస్. కోట మండలం కాశీపురానికి చెందినదిగా నిర్ధారణ చేశారు. సోమవారం బాలికను బంధువులకు అప్పగించారు. ఈ మధ్య కాలంలో తల్లిందండ్రులు మందలించారని పిల్లలు ఇంటి నుంచి పారిపోతున్నారని,అసలే రోజులు బాగా లేవని పోలీసులు తెలిపారు. పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

అస్తవ్యస్తంగా అబ్దుల్ కలామ్ పార్కు

- ఏళ్ల తరబడి నిర్వహణ కరువు
- పశువుల సంచారంతో భయం భయం

వెంకోజీపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల ఆట పాటలతో.. వృద్ధుల కబుర్లతో.. యువకుల వ్యాయామాలతో ఆహ్లాదకరంగా ఉండాల్సిన పార్కు ఆవుల సంచారంతో.. వాటి మురుగుతో అస్తవ్యస్తంగా మారింది. ఉదయాన్నే కరాటే శిక్షణకు వస్తున్న విద్యార్థులు, షెటిల్ ఆడేందుకు వస్తున్న యువకులు పార్కులో తొలుత గోమూత్రాలను ఎత్తే దుస్థితి నెలకొంది. ఒకప్పుడు ఈ పార్కుకు ఒక ప్రధాన గేటు, ఒక చిన్న గేటు ఉండేవి. ఈ గేట్లను మూసివేసి ఆవులు రాకుండా కొంతవరకు ఆటగాళ్లు , పార్కుకు వచ్చేవారు అరికట్టేవారు. కానీ కొద్ది రోజుల క్రితం చిన్న గేటు వద్ద గోడ పగిలి గేటు పడిపోయింది. మరోవైపు భారీ వృక్షం నేల కొరిగి గోడ విరిగిపోయింది. దీంతో ప్రధాన గేటు మూసివేసినా మిగిలిన రెండు మార్గాల మీదుగా ఆవులు పార్కు లోపలికి ప్రవేశిస్తున్నాయి. ఇది 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలామ్ యూజర్స్ అండ్ రిక్రియేషన్ పార్కు దుస్థితి. ఇక్కడి స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఖాళీ స్థలం ఇప్పటికే గోవులతో నిండిపోయింది. ఇది చాలదన్నట్లు పశువుల పెంపకందారులు పార్కులను కూడా వదలడం లేదు. రోజూ పాలు పితికిన తరువాత గోవులను తిరిగేందుకు పార్కులోకి వదిలేస్తున్నారు. దీంతో పార్కు మొత్తం ఆవు పేడలతో నిండిపోతుంది. రోజూ ఇక్కడికి వచ్చే ఆటగాళ్లు, కరాటే శిక్షణ పొందే చిన్నారులు పేడలను ఎత్తుకునే పరిస్థితి నెలకొంది.



పేడ ఎత్తుతున్న కరాటే క్రీడాకారులు



కూలిపోయిన ప్రహరీ గోడ

పట్టించుకోని పాలకులు

టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2018-19లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో పార్కులో వాకింగ్ ట్రాక్, బోరు, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, రెండు గేట్లు ఏర్పాటు చేశారు. 2019 తరువాత వైసీపీ ప్రభుత్వం రావడం, ఆ తరువాత జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీకి చెందిన మొల్లి లక్ష్మి కార్పొరేటర్‌గా గెలవడం జరిగింది. కార్పొరేటర్‌గా పదవి చేపట్టి ఐదేళ్లు పూర్తవుతున్నా.. వార్డులో కనీసం ఒక్క పార్కు కూడా అభివృద్ధి చేసిన పుణ్యానికి పోలేదు. అబ్దుల్ కలాం పార్కు కనీస నిర్వహణ కూడా నోచుకోలేదు. గతంలో ఈ పార్కులో ఏకంగా సచివాలయం భవన నిర్మాణానికి అప్పటి మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో శంకుస్థాపన కూడా చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంలో ఆ ప్రక్రియను నిలిపివేశారు. కానీ పార్కు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు.



రామకృష్ణాపురంలో కబ్జా చేసిన స్థలంలో వేసిన పాక

ఆక్రమణలో ప్రభుత్వ స్థలం

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధికి చెందిన 13వ వార్డులోని రామకృష్ణాపురం ఆక్రమణలకు నిలయంగా మారింది. బీఆర్‌టీఎస్ రోడ్డుకు సమీపంలోని రామకృష్ణాపురం చివరి భాగాన సుమారు 600 గజాల స్థలం ఆక్రమణకు గురైంది. అక్కడ చిన్న పాకలు వెలిశాయి. కారు నిలిపేందుకు ఒక షెడ్డు కూడా వేశారు. ఈ కబ్జా వెనుక సచివాలయ సిబ్బంది సహకారం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. అడిగేవారు లేక ఇక్కడ షెడ్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారని చెబుతున్నారు. తాను అధికార టీడీపీ మద్దతుదారును కావడంతో ఎవరూ ఏమీ చేయలేరని కబ్జాదారుడు చెబుతున్నాడని అంటున్నారు. ఈయన చెప్పిందే వేదంగా సాగుతున్న ఇక్కడ ఆక్రమణ స్థలాలపై జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు దృష్టి సారించాలని అందరూ కోరుతున్నారు.

సర్వీసు రోడ్డులో రేకుల షెడ్



సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన రేకుల షెడ్

ఆరిలోవ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధికి చెందిన 10వ వార్డులోని ఆదర్శనగర్ హైవేలో గల పెట్రోలు బంకు నుంచి ఇందిరానగర్ వైపు వెళ్తున్న సర్వీసు రోడ్డు ఆక్రమణకు గురైంది. ఈరోడ్డులో సర్వీసు రోడ్డుకు ఆనుకుని ఇటీవల ఒక షెడ్డు వేశారు. ఇందులో వాహనాలు పార్క్ చేస్తున్నారు. దీని వెనుక ఓ మెకానిక్ గ్యారేజీ కూడా ఉంది. ఇలా రోడ్డును ఆక్రమించి షెడ్డు వేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్యాపకులు మంచి రచనలు చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ అధ్యాపకుడు మంచి రచనలు చేసి సమాజానికి అందివ్వాలని డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు సూచించారు. భీమిలి ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి రచించిన 'విమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ సెల్ఫ్ గ్రూప్స్' పుస్తకాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే అధ్యాపకులు తమ విజ్ఞానంతో రచనలు చేయవలసిన అవసరముందన్నారు. నిరంతర విద్యార్థిగా ఆకళింపు చేసుకున్న విషయాలను పుస్తకాలుగా రూపొందిస్తే చాలా రచనలు సమాజానికి అందుతాయన్నారు. ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ మాట్లాడుతూ విష్ణుమూర్తి స్ఫూర్తితో అందరు అధ్యాపకులు పుస్తకాలు ప్రచురించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, జి. లక్ష్మణరావు, వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లపై మురుగు నీటి ప్రవాహం



పద్మనాభంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పద్మనాభం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రోడ్లపై చెత్త లేకుండా చేయడం,కాలువల్లో పూడికలు తీయడం,రోడ్లపై వాడుక నీరు పారకుండా చేయడం వంటి పనులు చేపట్టాల్సి ఉండగా కేవలం మండల కార్యాలయాల వద్ద రోడ్లు తుడిచి, మానవహారాలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. పద్మనాభంలోని అనంతపద్మనాభుని మెట్ల మార్గం అంతా మురుగు నీరు పారుతోంది. కొండను మెట్లమార్గం ద్వారా అధిరోహించే భక్తులు, నారాయణేశ్వర ఆలయాన్ని దర్శించుకోవడానికి వచ్చే వారు మురుగునీటిని తొక్కుకుని వెళ్తున్నారు. పద్మనాభంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారితో పాటు పద్మనాభంలోకి వెళ్లే ప్రధాన రోడ్డుపైనే నిత్యం మురుగునీరు పారుతోంది. కాలువల్లో చెత్త పేరుకుపోయి, దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ ప్రీమియం చెల్లింపునకు కలెక్టర్ హామీ

మహారాణిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌లో జర్నలిస్టు ప్రీమియం చెల్లింపునకు సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ఏడాది పాటు పొడిగించిందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జర్నలిస్టు సంఘం నాయకులు పి.సత్యనారాయణ, ఆర్.రామచంద్రరావు, కె.పరశురామ్, ఎం.కమల్‌కుమార్ ఉన్నారు.

దివ్యాంగులకు మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు

కలెక్టరేట్‌లో ఐదుగురు దివ్యాంగులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్‌లు సోమవారం పలు ఉపకరణాలు అందజేశారు. ఇందులో నాలుగు మొబైల్ టచ్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ ఉన్నాయి.

వేధింపులపై సచివాలయ ఉద్యోగిని ఫిర్యాదు

రాజకీయ కారణాలతో తనను వేధిస్తున్నారని పాయకరావుపేట సచివాలయంలోని వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న రెడ్డి సాధన అనే ఉద్యోగిని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నవారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

శాకంబరిగా పార్వతీదేవి



సీతమ్మధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ మాస పూజల్లో భాగంగా సోమవారం మహా శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీదేవిని పలు రకాల కూరగాయలతో శాకంబరి రూపంలో అలంకరించారు. అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మలు వేద మంత్రాలు పఠించారు.

గ్రంథాలయానికి పుస్తకాల విరాళం



పుస్తకాల్ని అందిస్తున్న రవీంద్రనాథ్

మురళీనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్‌లోని మహిళలు, పిల్లల ప్రత్యేక శాఖా గ్రంథాలయానికి ఓ దాత 28 పుస్తకాల్ని విరాళమిచ్చారు. గాయత్రి విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ జె.రవీంద్రనాథ్ సోమవారం గ్రంథాలయానికి పుస్తకాలతో వచ్చి లైబ్రేరియన్‌కు అందించారు. యువత, పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు మరింతగా పెరగాలని రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పుస్తకమే మనకు అన్నీ నేర్పుతుందన్నారు. యువత, బాలలు హాజరయ్యారు.

బడ్డీల తొలగింపు



ఏఎంజీ ఆసుపత్రి రోడ్డులో తొలగిస్తున్న బడ్డీ

సీతమ్మధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందడంతో నక్కవానిపాలెం ఏఎంజీ ఆసుపత్రి రోడ్డులో రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను, మెకానిక్ దుకాణాలను సోమవారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఆ రోడ్డులో ప్రజలకు శబ్ద కాలుష్యంతోపాటు రోడ్డును ఆక్రమించి వాహనాలు నిలిపి మరమ్మతులు చేస్తున్న ఓ దుకాణాన్ని కూడా తొలగించారు.

సుపరిపాలనలో తొలి అడుగుపై టీడీపీ నాయకుల ప్రచారం



గృహిణికి కరపత్రం అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు సింగాలమ్మపురం, వాసుదేవనగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైలా ముత్యాలనాయుడు, వాసుపల్లి రాజు, మధుసూదన్, నరేంద్ర, రామిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణ ఇలాగేనా?

- బాధ్యులకు నోటీసులివ్వండి
- రైల్వే అధికారుల నుంచి రూ.15 కోట్ల ఆస్తిపన్ను బకాయి వసూలుకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
- రైల్వేస్టేషన్ నుంచి తాటిచెట్లపాలెం వరకు తనిఖీలు



అధికారులకు సూచనలు చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

అక్కయ్యపాలెం/జ్ఞానాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ నుంచి తాటిచెట్లపాలెం వరకు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో శుభ్రత లేకపోవడాన్ని గమనించి వ్యర్థాల తొలగింపులో అలసత్వం చూపిన రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రతా లోపాలపై రైల్వే యాజమాన్యానికి వెంటనే నోటీసులు జారీ చేయాలని జోనల్ కమిషనర్ రామును ఆదేశించారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ కౌంటర్, జనరల్ టికెట్ కౌంటర్, కారు పార్కింగ్, ఆటో స్టాండ్, వీఐపీ పార్కింగ్ తదితర ప్రాంతాలు పరిశీలించి అక్కడి పారిశుధ్య పరిస్థితిపై అధికారులను ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు ఎన్ని గంటలు విధుల్లో ఉంటున్నారు? రోజుకు ఎన్ని ట్రిప్పుల్లో వ్యర్థాలు తరలిస్తున్నారు? అనే విషయాలను కమిషనర్ తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాల్లో చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి మైక్‌ద్వారా అవగాహన కల్పించే ప్రకటనలు, బోర్డులు ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. మలేరియా, డెంగ్యూ జ్వరాల వ్యాప్తిని నివారించేందుకు పిచికారీ, ఫాగింగ్ పనులను వారానికి మూడుసార్లు నిర్వహించాలన్నారు. ప్రజా మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శులదేనని స్పష్టంచేశారు. మార్గంమధ్యలోని సెంట్రల్ మీడియన్‌లో పచ్చదనం లోపాన్ని గమనించి ఉద్యాన అధికారికి నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే చెట్ల మొదళ్లకు గ్రిల్స్ ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో అస్తవ్యస్తంగా ఉన్న బడ్డీలు, టిఫిన్ సెంటర్లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. రైల్వే అధికారుల నుంచి రూ.15 కోట్ల ఆస్తిపన్ను బకాయి వసూలుకు తక్షణమే నోటీసులు జారీ చేసి రాబట్టాలని కమిషనర్ ఆదేశించారు. అధికారులు దిలీప్, పళనికుమార్, అర్చన, జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా శారీ వాక్



సంప్రదాయ శారీవాక్‌లో పాల్గొన్న యువతులు

డాబాగార్డెన్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మిస్ అండ్ మిసెస్ శ్రావణలక్ష్మి శారీవాక్‌లో పాల్గొన్న మహిళలు తమదైన హావభావాలు ప్రదర్శిస్తూ ర్యాంప్‌వాక్‌పై అలరించారు. క్వీన్స్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో సంప్రదాయ శారీవాక్‌లో మహిళలు, యువతులు ఆద్యంతం సందడి చేశారు. పరికిణి...ఓణీలతో తెలుగు సంస్కృతిని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పేడాడ రమణికుమారి, పీలా వెంకటలక్ష్మి, శ్రీదేవి, సత్యనారాయణ, మోదవలస ఉషారాణి హాజరయ్యారు. మిసెస్ శ్రావణలక్ష్మి విభాగంలో శారీవాక్ చేసిన అనంతరం లక్ష్మీదేవి, శ్రావణ మాసం, పసుపు, కుంకుమ, తాంబూలం తదితర అంశాల విశిష్టతలను మహిళలు ఒక్కొక్కరిగా వివరించారు. పోటీలకు సంగీత, మాధురి, నక్షత్ర, భాగ్యలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మిసెస్ క్యాటగిరీలో మనీషా, మిస్ కేటగిరీలో తన్వీ సుచరిత విజేతలుగా నిలిచారు. వెరోనికా, వెన్నెల, బిందుశ్రీ, దివ్య కిషోర్, రేష్మ, దివ్య రాజేష్ రన్నర్‌లుగా ఎంపికయ్యారు. విజేతలను అతిథులు అభినందించారు.

విద్యార్థుల ఆధార్ అప్‌డేట్‌కు చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి గొండు సీతారాం సూచన

అక్కయ్యపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో 15 ఏళ్లు దాటిన విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేసే కేంద్రాలు ఏర్పాటు విధానానికి కొత్త టెక్నాలజీతో చర్యలు చేపట్టి బాలల హక్కులను పరిరక్షించాలని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, యూఐడీఏఐ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారికి ఇటీవల లేఖలు రాసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏడేళ్లు దాటిన పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడం తప్పనిసరి చేసిందన్నారు. ఈ ఆదేశాలతో రాష్ట్రంలో అయిదు నుంచి ఏడేళ్ల మధ్య పిల్లల ఆధార్ అప్‌డేట్‌కు ముందుకు రాకపోవడం తల్లిదండ్రుల అవగాహనలేమి తెలియజేస్తుందన్నారు. లక్షలాది మంది పిల్లలు, విద్యార్థులు వివిధ స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు.

ఆకతాయిల వికృత చేష్టలు

అక్కయ్యపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల వికృత చేష్టలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల పరిసరాల్లో వీరి బెడద ఎక్కువైంది. పాఠశాల వద్ద విచ్చలవిడిగా తిరుగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పాఠశాల తెరిచినప్పటి నుంచి బైక్‌లతో గేటు ఎదుట చక్కర్లు కొడుతున్నారు. విద్యార్థినులతో ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రశ్నించే వారిని దుర్భాషలాడుతూ దాడికి దిగుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలకు విచ్చేస్తున్న విద్యార్థినులు ఆకతాయి చేష్టలకు భయాందోళన చెందుతున్నారు. ఆకతాయిలకు చెక్ పెట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇటీవల ఓ విద్యార్థిపై ఆకతాయిలు దాడి చేసేందుకు ప్రయత్నించారని, స్థానికులు కేకలు వేయడంతో పారిపోయారని పలువురు చెబుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో వినతుల స్వీకరణ

సీతమ్మధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ కోర్టు పనులనిమిత్తం వెళ్లడంతో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాల మంజూరు కోసం దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

శ్రీపద సంకీర్తన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ద్వారం త్యాగరాజు, ఇతర ప్రముఖులు

సీతంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సోమవారం సహృదయ సాహితి సంస్థ, జగత్కళ్యాణ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో రాజయోగి వెంకటపతి స్వామి రచించిన శ్రీపద సంకీర్తన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కనకమహాలక్ష్మి సంకీర్తన గానలహరి కార్యక్రమాన్ని ద్వారం మ్యూజిక్ అకాడమి, త్యాగరాజ శిష్య బృందం నిర్వహించారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ద్వారం వీకేజీ త్యాగరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావ్యాలు మూడు రకాలంటూ, నారికేళ పాకం, కదళీ పాకం, ద్రాక్ష పాకంతో పోల్చారు. సంకీర్తనలను రచించిన రాజయోగి వెంకటపతి స్వామిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆధ్యాత్మికవేత్త మరడాన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాధవధార, కంచరపాలెంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



మాధవధార ఉడాకాలనీలో కల్వర్టు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయరు పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తదితరులు



కస్తూరినగర్‌లో నూతన భవనాన్ని ఆరంభిస్తున్న మేయరు, ఎమ్మెల్యే

మాధవధార/కంచరపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాధవధార, కంచరపాలెం ప్రాంతాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులను నగర మేయరు పీలా శ్రీనివాసరావుతో కలసి విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. మరికొన్ని కొత్త పనులకు భూమి పూజ చేశారు. గ్రేటర్ 46వవార్డు కంచరపాలెం పరిధిలోని కస్తూరినగర్, లక్ష్మీనారాయణపురం ప్రాంతాల్లో రూ.90 లక్షలతో నిర్మాణం చేపట్టిన కొత్త సామాజిక భవనాల్ని ఆరంభించారు. మేయరు పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజులు రిబ్బన్ కట్ చేసి కొత్త భవనాల్ని ప్రజోపయోగ పనులకు, సామాజిక వినియోగానికి అప్పగించారు. మాధవధార కళింగనగర్‌లో రూ.60 లక్షలతో నూతన డ్రైనేజీ కట్టడాలు, సీసీరోడ్లు, మాధవధార ఉడాకాలనీ గెడ్డపై కొత్త కల్వర్టు నిర్మాణాలకు భూమిపూజ చేసి, శిలాఫలకాల్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త పి.ఉషాకిరణ్, ఎస్.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయరు కె.సతీష్, 51వవార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ, బీజేపీ ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ సురేష్ బాబు, 51వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.కీర్తి, 43, 46 వార్డుల బీజేపీ, టీడీపీ అధ్యక్షులు గారా ఈశ్వరరావు, రఘునాథ్, పుక్కళ్ళ పైడికొండ, నాయకులు శ్యామలా దీపిక, రాగతి రమణమ్మ, సురేష్‌బాబు, శంకర్ పాల్గొన్నారు.

పి-4 సర్వేను సమగ్రంగా చేపట్టాలి: వరప్రసాద్



మాధవధారలో గ్రామసభలో సత్కారం పొందిన సచివాలయ సెక్రటరీలతో ఎస్.వరప్రసాద్

మాధవధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాధవధార బృందావన్ పార్కు వద్ద సచివాలయంలో సోమవారం పి-4 సర్వేకి సంబంధించి గ్రామసభ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది క్షుణ్ణంగా సర్వే చేపట్టాలని వరప్రసాద్ సూచించారు. అట్టడుగున ఉన్న కుటుంబాల్ని గుర్తించి, జాబితాల్ని ప్రదర్శిస్తారని అన్నారు. 50వవార్డు పరిధిలోని సచివాలయాల నుంచి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న కార్యదర్శులను వరప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డులోని యూసీడీ రిసోర్స్ పర్సన్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కోర్సులు

సాగర్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పలు కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని వర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు తెలి పారు. నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు దీక్షా రంభ్ పేరిట సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల్లో మార్పులు చేస్తూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచుతున్నామన్నారు. పలు ఐటీ, ఔషధ పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. యూజీ స్థాయి విద్యార్థులను పరిశోధనలకు ప్రోత్సహిస్తున్నామన్నారు.

సచివాలయాల్లో సర్టిఫికెట్లు అందక విద్యార్థుల ఆందోళన

- బదిలీపై వెళ్లిన ఉద్యోగులు విధుల్లో చేరక అవస్థలు

మహారాణిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల నుంచి విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్‌లు అందక అవకాశాలు కోల్పోతున్నామని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జూన్, జూలై నెలలు ఎంతో కీలకం. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర వాటిలో చేరేందుకు కీలకమైన సమయమిది. ప్రధానంగా విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని చేరబోతున్న విద్యాసంస్థల్లో సమర్పించవలసి ఉంటుంది. తద్వారా వారికి రిజర్వేషన్ కేటగిరీలను పరిగణనలోకి తీసుకొని సీట్లు కేటాయిస్తారు. ఇందుకోసం విద్యార్థులు ఇప్పటికే వార్డు సచివాలయాలు, మండల కార్యాలయాల్లో తమకు కావలసిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. దీనితో సచివాలయ ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. అందులో కొందరు తమ చోటు నుంచి రిలీవ్ కాలేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇంకా జాయిన్ కాలేదు. జాయిన్ అయినా సెలవుపై వెళ్లిపోయి పూర్తిగా విధులు చేపట్టలేదు. దీనితో విద్యార్థులకు సచివాలయం నుంచి జారీ కావలసిన సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. కళాశాలల్లో వాటిని సమర్పించ లేకపోవటంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని కోర్సులకు ఆఖరు తేదీలు ముగిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కార్యాలయాలలో అన్ని సంతకాలు పూర్తి అయినా సచివాలయ ఉద్యోగులు పూర్తి స్థాయిలో విధుల్లోకి చేరకపోవటంతో ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పరిణామాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తమకు ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు జారీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సర్టిఫికెట్లు సమర్పించే గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హరిత సోయగానికి చర్యలు



హైవే రోడ్డులో మొక్కల్ని ఆకృతిగా కట్ జేస్తున్న కార్మికులు

మాధవధార, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగర పచ్చదనాన్ని మరింత ఇనుమడింపజేసేలా శనివారం హైవే రోడ్లలో మొక్కల సుందరీకరణ పనులు ఆరంభించారు. నాలుగు వరుసల హైవే దారుల్లో మొక్కలను క్రమపద్ధతిలో కటింగ్ చేసి నగర రహదారుల్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తున్నారు. ప్రధాన కారిడార్ లోనూ, సర్వీసు రోడ్డు చివర డివైడరులో పలు రకాల పూల మొక్కల్ని, హైబ్రీడ్ రకాలను ఆకర్షణీయంగా కట్ చేశారు. ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు ఉన్న ప్రధాన కూడళ్లు, ఆర్అండ్‌బీ, ఊర్వశి జంక్షన్, బిర్లా జంక్షన్ ప్రాంతాల్లోని గ్రీనరీ ప్రాంతాలను క్రమబద్ధీకరించారు. జీవీఎంసీ ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగం అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు.

కార్మికుల భద్రత పరిశ్రమల బాధ్యత

- రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌వర్మ



మాట్లాడుతున్న చంద్రశేఖరవర్మ

భీమునిపట్నం (రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా కార్మికులు పనిచేసే చోట భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డి. చంద్రశేఖర్‌వర్మ సూచిం చారు. సోమవారం ఆయన చిప్పాడ దివీస్ కర్మాగారంలో జరిగిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల భద్రత విషయంలో రాజీపడకుండా అత్యంత ఆధునిక యంత్రాలను అందుబాటులో ఉంచా లని చెప్పారు. పనికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో పని చేసే ప్రదేశంలో కార్మికుల భద్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ ముఖ్య ఇన్‌స్పెక్టర్ జె. శివశంకరరెడ్డి మాట్లాడుతూ భద్రతా చర్యలు బాగుంటే ప్రమాదాలు జరగవని, ఒకవేళ జరిగినా ఎటువంటి నష్టం ఉండదన్నారు. పలువురు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఏయూలో క్వాంటం కంప్యూటింగ్

(5వ పేజీ తరువాయి)

మెటీరియాలజీ ఓషనోగ్రఫీ విభాగం నుంచి గతంలో నిర్వహించి నిలిపివేసిన ఎంటెక్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఎంటెక్ ఓషియానిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి పునఃప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

మరిన్ని నిర్ణయాలు

సెనేట్ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏయూ దూర విద్యా కేంద్రం నుంచి నిర్వహిస్తున్న పీజీ కోర్సులకు సంబంధించి వార్షిక పరీక్షల స్థానంలో సెమిస్టర్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. సైన్స్ కళాశాల పరిధిలో పలు విభాగాల్లో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల నిర్వహణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా మెరైన్ లివింగ్ రీసోర్స్ విభాగం పరిధిలో ఏడాది కాల వ్యవధితో ఆక్వా కల్చర్‌లో పీజీ డిప్లమో కోర్సును నిర్వహించడానికి ఆమోదముద్ర వేశారు. ఏయూ చిత్రకళా విభాగం, థియేటర్ ఆర్ట్స్ విభాగాలను సమన్వయం చేస్తూ స్కూల్ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ ఏర్పాటుచేయాలని మాజీ ఉప కులపతులు కొందరు సూచించారు. ఏయూ శతాబ్ది వేడుకలను జరుపుకుంటున్న తరుణంలో ప్రత్యేక గ్రాంటును అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలని పాలక మండలి సభ్యులు, పూర్వ ఉపకులపతులు సూచించారు. దీనిపై ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేశామని, త్వరలో సమగ్ర ప్రతిపాదనలతో లేఖలు రాయనున్నట్టు వెల్లడించారు. ఏయూ సాధించిన ప్రగతిని, విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను, పూర్వ విద్యార్థులతో అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, మాజీ వీసీలు ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, బీలా సత్యనారాయణ, జీఎస్ఎన్ రాజు, జి.నాగేశ్వరరావు, పీవీజీడీ ప్రసాదరెడ్డి, పాలక మండలి సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ చైర్మన్లు, అకడమిక్ సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

పెచ్చుమీరుతున్న రౌడీషీటర్ల ఆగడాలు

(5వ పేజీ తరువాయి)

ఫలితం ఉండడం లేదు. కత్తులతో తిరిగినా, దాడి చేసినా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారనే భయం రౌడీషీటర్లలో లేకుండా పోయింది. వీధుల్లో ఆకతాయిలు వాహనాలతో వీరంగం సృష్టించడం, దారిన వచ్చిపోయే యువతులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం చేస్తున్నారు. అటువంటి వారిపై పోలీసులు నిఘా పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. సరైన కారణంగా లేకుండా అర్ధరాత్రి రోడ్లపై గుంపులుగా తిరిగే వారిని స్టేషన్‌కు తరలించాలని, ఆ దిశగా పోలీసులు దృష్టిపెట్టాలంటున్నారు.

పర్యాటక శాఖ భూములు లీజుకు...

(5వ పేజీ తరువాయి)

మండలం ఎండాడ సర్వే నంబరు 113/5లో 31 సెంట్లు.

- ఎండాడలో సర్వే నంబరు 187లో 3 ఎకరాలు.
- రుషికొండ సర్వే నంబరు 38లో 8.44 ఎకరాలు.
- రామానాయుడు స్టూడియో సమీపాన సర్వే నం. 426/2లో 5 ఎకరాలు
- భీమిలి మండలం అన్నవరం ఎల్‌పీ నం.1356, 1360లలో 17.25 ఎకరాలు
- ఎండాడ సర్వే నంబర్లు 106/1, 106/4లలో 2.33 ఎకరాలు
- గాజువాక మండలం యారాడ సర్వే నంబరు 53/పిలో 5 ఎకరాలు
- నేరెళ్లవలస సర్వే నంబరు 126లో 1.70 ఎకరాలు
- కాపులుప్పాడ సర్వే నం.284/3, 287/4, 287/5, 288/2లలో 17.42 ఎకరాలు
- ఎండాడలో సర్వే నంబర్లు 183, 184, 185లో 9 సెంట్లు
- అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి మండలం న్యాయంపూడి సర్వే నంబరు 80/2లో 1.17 ఎకరాలు
- పరవాడ ముత్యాలమ్మపాలెం సర్వేనం 324/2లో 12.52 ఎకరాలు
- అచ్యుతాపురం మండలం పూడిమడక సర్వే నం 85/3లో 2.58 ఎకరాలు
- ఎస్.రాయవరం మండలం గుడివాడ (రేవుపోలవరం) సర్వే నంబరు 380లో 5 ఎకరాలు
- అనకాపల్లి మండలం శంకరంలో 150, 143, 144, 154 సర్వే నంబర్లలో 1.4 ఎకరాలు
- అల్లూరి జిల్లా అనంతగిరి మండలం నందకోట సర్వే నంబర్లు 22, 28లలో 43.1 ఎకరాలు

బీఎస్ఎన్ఎల్ సెల్‌చల్

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి ఉంది. విశాఖ జిల్లాలో ఎనిమిది, అనకాపల్లి జిల్లాలో 41, అల్లూరి జిల్లాలో 571 టవర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటికే 416 టవర్లు ఏర్పాటు చేశారు. మిగిలిన టవర్లు ఏర్పాటుచేయడానికి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. మెటీరియల్ తీసుకువెళ్లేందుకు అనువైన మార్గాలు లేక ఏజెన్సీ ప్రాంతంలో ఈ పనులు ముందుకు సాగడం లేదంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో బీఎస్ ఎన్ఎల్ వినియోగదారులు 6,18,000 మంది ఉన్నారు. ఇందులో 5.4 లక్షల మంది ప్రీ పెయిడ్, 42 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియోగదారులు ఉన్నారు. మరో 36 వేల మంది ల్యాండ్ లైన్ వినియోగదారులు.

సేవలకు తగిన గుర్తింపు

అక్కిరెడ్డిపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమాజ సంక్షేమానికి కృషి చేసే వ్యక్తులకు తప్పనిసరిగా తగిన గుర్తింపు లభిస్తుందని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. హైదారాబాద్‌కు చెందిన వరల్డ్ దళిత ఆర్గనైజేషన్ ఏటా సేవా రంగంలో కృషి చేసేవారికి అందించే ప్రతిష్ఠాత్మకమైన అంబేడ్కర్ సేవాశ్రీ అవార్డును ఇటీవల అందుకున్న బెల్ హెచ్‌పీవీపీ ఉద్యోగి సుగురు జయప్రకాశ్‌ను సోమవారం తుంగ్లాంలో ఆయన ఘనంగా సత్కరించారు. పెట్లి అర్జున్, సూర్యనారాయణ, టి.నాగేశ్వరరావు, జి.అప్పారావు, పి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ వాహన డ్రైవర్ల ఆందోళన

గాజువాక, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోన్‌లో క్లాప్ వాహనాలు, లోడర్స్ నడుపుతున్న కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం జోన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని, పని ప్రదేశంలో ప్రమాదాలకు గురైన వారిని పట్టించుకోలేదని, కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీతాల కోసం ప్రతినెలా ఆందోళన చేయాల్సి రావడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, ఎం.రాంబాబు, నాగరాజు, ధనరాజ్, మహేశ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికల అప్పగింత

పెందుర్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఇంట్లోవారు చదువుకోమని మందలించడంతో అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మైనర్ బాలికను తల్లిదండ్రుల చెంతకు పోలీసుకు చేర్చారు. సీఐ కేవీ సతీశ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేశపాత్రునిపాలానికి చెందిన మైనర్ బాటికను ఇంట్లో వాళ్లు చదువుకోవాలని చెప్పడంతో ఈనెల 17న అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బాలి ఆచూకీ కోసం నగరంలో వెతికారు. ఈ క్రమంలో సోమవారం రైల్వేస్టేషన్ వద్ద బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

వెల్ఫేర్ హోమ్ నుంచి ఇంటికి

ఇంటి నుంచి పారిపోయి వేపగుంట జంక్షన్‌లో అనాథలా తిరుగుతున్న ఓ బాలికను పెందుర్తి పోలీసులు ఈ నెల 13న నగరంలోని చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. అనంతరం బాలిక వివరాలు సేకరించగా ఎస్‌కోట మండలం కాశీపురానికి చెందినదిగా నిర్ధారణ చేశారు. సోమవారం బాలికను బంధువులకు అప్పగించారు. ఈ మధ్య కాలంలో తల్లిదండ్రులు మందలించారని పిల్లలు ఇంటి నుంచి పారిపోతున్నారని, అసలే రోజులు బాగా లేవని పోలీసులు తెలిపారు. పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

సంతాపం

అక్కిరెడ్డిపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ నేటి నాయకులకు ఆదర్శంగా నిలుస్తారని బెల్ హెచ్‌పీవీపీ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జీటిపి ప్రకాశ్ అన్నారు. సోమవారం అచ్చుతానందన్ మృతి చెందడంతో బెల్ హెచ్‌పీవీపీలో సీఐటీయూ నాయకులు సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు సనపల జగన్నాథరావు, నారపరెడ్డి, విజయ్‌కుమార్, ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు

సినిమా గైడ్

- **జూనియర్** : మెలోడీ, శరత్, జగదాంబ, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ)
- **తమ్ముడు** : శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : రమాదేవి
- **కొత్తపల్లిలో** : శారద
- **ఓ భామ అయ్యో రామ** : శారద
- **కన్నప్ప** : కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నటరాజ్ (పెందుర్తి).
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 33, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 24, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 32, బీరకాయలు 28, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 22, క్యారెట్ 44, దొండకాయలు 28, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 46, దేముడు చిక్కుడు 72, గోరుచిక్కుడు 42, బ్రకోలి 45, కూరపెండలం 30, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడిఅల్లం 56, బూడిద గుమ్మడికాయ 20, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్రాయ్‌	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



కణితి రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపు నీరు



ఆటోనగర్ ఈ-బ్లాక్ రహదారిలో ఉన్న గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

భారీ వర్షానికి జలమయమైన రోడ్లు

గాజువాక/కూర్మన్నపాలెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక, కూర్మన్నపాలెం, తదితర ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కొనసాగగా.. ఆ తరువాత ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని భారీ

గోతుల్లో నీరు చేరడంతో ఇబ్బందులకు గురైన ద్విచక్ర వాహనదారులు

వర్షం కురిసింది. దీంతో రహదారులపై పెద్దఎత్తున వర్షపు నీరు పారింది. పలు ప్రాంతాల్లోని రహదారుల్లో ఉన్న గోతుల్లో నీరు చేరడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించిన ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. కాగా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది కాలువలు, గెడ్డలు పూడికతో నిండకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపడుతున్నారు. వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది.

అభివృద్ధి చూసి ఓర్వలేకే వైసీపీ చౌకబారు రాజకీయాలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుంటే ఓర్వలేని వైసీపీ నాయకులు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. నేర చరిత్ర కలిగిన వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ 74వ వార్డు నాయకులు సోమవారం దయాళ్ నగర్‌లో నిర్వహించిన ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పల్లా పాల్గొని మాట్లాడారు. వైసీపీ హయాంలో దోచుకోవడం-దాచుకోవడం, అడ్డొచ్చిన వారిని వేధించడమే జరిగిందని విమర్శించారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో చేసిందేమిటో ప్రజలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వియ్యపు కొండబాబు, దువ్వి శ్రీనివాస్, సింహాద్రి, గోమాడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి

అగనంపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలో కూటమి శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటిపడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధితో పాటు అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గనిరెడ్డి రామారావు, పి.మూర్తి, జి.చిన్నారావు, అప్పారావు, నూకరాజు, రాజు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గరుడాద్రి ఆలయాన్ని సందర్శించిన ధార్మిక సంఘాల ప్రతినిధులు



తహశీల్దార్ అమలతో మాట్లాడుతున్న ధార్మిక సంఘాల ప్రతినిధులు

పెదగంట్యాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి గరుడాద్రిపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు సందర్శించారు. ఆలయ పరిధిలో ప్రహరీ కట్టేందుకు కమిటీ యత్నించడం... దానిని రెవెన్యూ సిబ్బంది అడ్డుకోవడం ఆరా తీశారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు తాము కృషి చేస్తుంటే మండల రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని ఆలయ కమిటీ సభ్యులు వారికి వివరించారు. అనంతరం వారు పెదగంట్యాడ తహశీల్దార్ అమలను కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఆలయానికి సంబంధించిన ఆస్తులకు తాము ఎలాంటి నష్టం కలిగించలేదని, నూతనంగా చేపట్టిన ఆక్రమణను తొలగించే ప్రయత్నం చేశామన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మరక్షణ సమితి సభ్యులు భవనేశ్వరి శర్మ, హరిత, విజయ్ కుమార్, విశ్వహిందూ పరిషత్ సభ్యుడు పూడి పెద్దిశర్మ, హిందూ ధర్మ పరివార్ సభ్యులు సంతోశ్, భవానీప్రసాద్ శర్మ, నారాయణరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

అగనంపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళుతున్న కార్యదర్శులు పరమేశ్వరరావు, రాంబాబు, రామ్ సుధాకర్, భార్గవ్, వరలక్ష్మి, లావణ్య, జయలక్ష్మిలను సోమవారం స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో ఎప్పుడూ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు చందూరమేశ్, డొక్కా రమేశ్, బి.సత్యనారాయణ, వి.శ్రీను, పి.అచ్యుత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో అండమాన్ వెళుతూ ఏఎన్32 విమాన ప్రమాదంలో మృతి చెందిన తమ ఉద్యోగులను స్మరిస్తూ జూలై 22న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్ఏడీ సీఈ యూనియన్ అధ్యక్షుడు పీఎన్ రాజు ప్రకటనలో తెలియజేశారు. ఈ ప్రమాదం జరిగి 9 సంవత్సరాలు పూర్తయిందని, మరణించిన 8 మంది ఉద్యోగులకు నివాళులుగా మంగళవారం ఉదయం 9 గంటలకు హష్మి భవనంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌కు 5 ఫిర్యాదులు

వేపగుంట.జూలై 21(ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యం గా జీవీఎంసీ 93వ వార్డు గొల్ల నారాయణపురంలో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని, 95వ వార్డు సప్తగిరినగర్‌లో యూజీడీ డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని, 97వ వార్డు విశాఖ మార్ట్ దగ్గర ఫుట్‌పాత్ ఆక్రమణను నిరోదించాలని, సత్యానగర్‌లో అండర్ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని తదితర ఫిర్యాదులందాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపి చర్యలు తీసుకుంటామని జడ్సీ హైమావతి తెలిపారు.

చీకటిమయంగా బీసీ రోడ్డు

పెదగంట్యాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ జంక్షన్ నుంచి కాకతీయ కూడలి వరకు బాలచెరువు రోడ్డు రాత్రయ్యే సరికి చీకటిమయంగా మారుతున్నది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో రాత్రిపూట ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాజువాక ప్రాంతం నుంచి స్టీల్ ప్లాంటుకు సీ-షిఫ్టుకు వెళ్లే కార్మికులు, బీ-షిఫ్ట్ దిగి ఇళ్లకు వచ్చేవారు, రాత్రిపూట పెదగంట్యాడ, నెల్లిముక్కు, సీతానగరం, దయాళ్‌నగర్ సిద్ధేశ్వరం, తదితర ప్రాంతాల నుంచి కొత్త గాజువాకకు రాక పోకలు సాగించే వారు నానాపాట్లు పడుతున్నారు. అలాగే వికాస్‌నగర్, ప్రియదర్శినీ కాలనీ, సంజీవకాలనీ ప్రాంతాల నుంచి కొత్తగాజువాకకు రాకపోకలు సాగించే వారికి ఇక్కట్లు తప్పడం లేదు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది?: మంత్రి అచ్చెన్న



'తొలి అడుగు'లో భాగంగా వృద్ధురాలికి కరపత్రం అంజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో గండి బాబ్జీ, తదితరులు ఉన్నారు

పెందుర్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): 'అమ్మా నేను రాష్ట్ర మంత్రిని. ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది. సమయానికి ఫించన్ అందుతుందా? తల్లికి వందనం వచ్చిందా? పాలనలో తప్పులుంటే నిర్మోహమాటంగా చెప్పండి సరిదిద్దుకుంటాం' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్థానిక మహిళలను ప్రశ్నించారు. గుర్రమ్మపాలెంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరు గురించి ప్రశ్నించారు. ఈ సందర్భంగా తనుకు నెలకు రూ.4వేలు పింఛన్ అందుతోందని ఓ వృద్ధురాలు చెప్పింది. ఈ కార్యక్రమంలో అచ్చెన్నకు, గండి బాబ్జీకి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జట్టీ నిర్మాణం వద్దంటూ కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న యారాడ రైతులు

మల్కాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): యారాడలో జట్టీ నిర్మాణం కోసం వచ్చిన ప్రతిపాదనను వెనుక్కు తీసుకోవాలని గ్రామ రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. యారాడలో దాదాపు వ్యవసాయ కుటుంబాలే ఉన్నాయని, జట్టీ నిర్మిస్తే తమ జీవనాధారం దెబ్బతింటుందని తెలిపారు. తమ గ్రామంలో ఒక్క మత్స్యకార కుటుంబం కూడా లేదని అన్నారు. ఇంతకముందు 2008లో అప్పటి ప్రభుత్వం జట్టీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు తీసుకొచ్చిందని, అప్పుడు గ్రామంలోని ప్రజలు వ్యతిరేకించడంతో అది ఆగిపోయిందని అన్నారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రతిపాదనను తీసుకు రావడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు జట్టీ నిర్మిస్తే వ్యవసాయం దెబ్బతింటుందని, తద్వారా ఆర్థికంగా ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాకు కూడా నాశమవుతాయని రైతులు వినతి పత్రంలో పేర్కొన్నారు.

92వ వార్డులో కార్డెన్ సెర్చ్



వాహన రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ అప్పలనాయుడు

గోపాలపట్నం, జూలై 21(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం గ్రామంలో గోపాలపట్నం పోలీసులు సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లను తనిఖీ చేసి, వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్న బెల్టుషాపు ఉన్నదని గుర్తించి, నిర్వాహకుడు ఉరుకూటి పైడిరాజును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా బెల్టుషాపులు నిర్వహించినా, అసాంఘీక కార్యకలాపాలు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి. అప్పలనాయుడు తదితర పోలీసులు పాల్గొన్నారు.



తిరుమలనగర్ పార్కులో మొక్కలు నాటుతున్న కాలనీవాసులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కూర్మన్నపాలెం,జూలై 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధి జి.విశ్వేశ్వరరావు అన్నారు. 87వ వార్డు తిరుమల నగర్‌లో సోమవారం స్వచ్ఛాంధ్ర ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా కాలనీలో పార్కుల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. ఇంటికొక మొక్కతో పాటు కంపోస్టు ఎరువును కూడా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, డాక్టర్ ప్రభుదాస్, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న ప్లాంట్ ట్రాఫిక్ విభాగాధిపతి విజయ్‌కుమార్

క్రీడలతో కార్మికులకు మానసిక ఉల్లాసం

స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్ విభాగాధిపతి డి.విజయ్‌కుమార్

ఉక్కుటౌన్‌షిప్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నిరంతరం పని ఒత్తిడిలో నిమగ్నమయ్యే కార్మికులకు క్రీడల ద్వారా మానసిన ఉల్లాసంగా లభిస్తుందని స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్ విభాగాధిపతి డి.విజయ్‌కుమార్ అన్నారు. స్టీల్ ప్లాంట్ తృష్ణా మైదానంలో ట్రాఫిక్ విభాగం క్రికెట్ లీగ్ సీజన్ పోటీలను నిర్వహించారు. సోమవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాంట్ ప్రగతిలో యువ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలన్నారు. క్రమశిక్షణతో ప్లాంటును మరింత అభివృద్ధిలోకి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభాగం డీజీఎం ఎస్.శ్రీధర్, కార్మికులు శ్రీనివాస్‌రెడ్డి, రామన్న, ఎం.రాము, జగదీశ్, కోటినాయుడు, రాజా, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ఉక్కునగరం విద్యార్థికి పతకం



అట్టాడ చరణ్

ఉక్కుటౌన్‌షిప్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన అండర్-16 బాలుర విభాగం ఏషియన్ వాలీబాల్ పోటీల్లో స్టీల్ ప్లాంట్ డీఏవీ పాఠశాల పూర్వ విద్యార్థి అట్టాడ చరణ్ కాంస్య పతకం సాధించాడు. 2023-24లో ఫిరోజాబాద్‌లో జరిగిన డీఏవీ నేషనల్స్ వాలీబాల్ పోటీల్లో చరణ్ పాల్గొని పతకాలను సొంతం చేసుకున్నాడు. 2024-25 బ్యాచ్ పదో తరగతి చదివిన చరణ్ వాలీబాల్‌లో రాణించి ఇప్పుడు ఏషియన్ పోటీల్లో పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని పాఠశాల హెచ్ఎం సుగంధ కుమారి పేర్కొన్నారు.

25 నుంచి గ్రీన్ సిటీలో శ్రావణ లక్ష్మి పూజలు



వివరాలు తెలుపుతున్న బండి సురేశ్‌కుమార్

ఆటోనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ గ్రీన్ సిటీలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈ నెల 25 నుంచి ఆగస్టు 28వ తేదీ వరకు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావులు పేర్కొన్నారు. సోమవారం ఆలయంలో వారు మాట్లాడుతూ 25న శ్రావణ మాసం మొదటి శుక్రవారం ఐశ్వర్య మహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకాలు, సహస్రనామార్చన, 28న గోదాదేవి తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాభిషేకాలు, 29న గరుడ పంచమి సందర్భంగా గరుడ ఆళ్వార్‌కు అభిషేకం, 31న సుదర్శన స్వామి తిరునక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకాలు జరుపుతామన్నారు. ఆగస్టు 1న లక్ష పసుపుకొమ్ముల పూజ, 5న ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవారికి ప్రత్యేక పూజలు, 8న సహస్ర కమలాలతో అర్చన, సప్తహారతులు, 9న శ్రావణి పౌర్ణమి సందర్భంగా శ్రీలక్ష్మి, శ్రీనివాసుల కల్యాణ్యాన్ని వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే 15న సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి సహస్ర గాజులతో అలంకరణ, 22న లక్ష చామంతుల పూజ, అష్టోత్తర కలశాభిషేకం, సప్త హారతులు, మహిళలచే అర్చనలు, కుంకమ పూజలను ఘనంగా చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పద్మజ, రాజ్యలక్ష్మి, చిన్న సురేశ్, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, సునీల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు దుశ్శాలువా కప్పి సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మల్కాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మోటర్ వాహనాలపై అమలవుతున్న గ్రీన్ ట్యాక్స్ రూ.16వేలను రూ.3వేలకు కుదించడం తమకు ఎంతో సంతోషంగా ఉన్నదని విశఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను అసోసియేషన్ సోమవారం కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకుందని, అందుకు కూటమి ప్రభుత్వానికి తాము కట్టుబడి ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

'హరిహర వీరమల్లు' విజయం సాధించాలని పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అంతక ముందు తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమాను బాగా ప్రమోట్ చేయాలని కార్యకర్తలకు సూచించారు.

పంచకర్ల మానవత్వం

అనకాపల్లి నుంచి పెందుర్తి వస్తున్న పంచకర్లకు ద్విచక్ర వాహనం రోడ్డు ప్రమాదానికి గురవడం చూసి క్షతగాత్రులను ఆటోలో ఎక్కించి అనకాపల్లి ఆస్పత్రిలో చేర్పించారు. ఎమ్మెల్యే పంచకర్లను పలువురు ప్రశంసించారు.

బాజీ జంక్షన్‌లో బోరు పనులకు శంకుస్థాపన

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బాజీజంక్షన్ సంతలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బోర్ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ బొమ్మిడిరమణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ సంత జరుగుతున్నా మంచి నీటి సదుపాయం లేదని వ్యాపారులు ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి బోర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని చెప్పారు.

జోన్-8లో క్లాప్ వాహనాలు నిలిపివేత

వేపగుంట, జూలై 21(ఆంధ్రజ్యోతి): గాజువాక జోన్ పరిధిలో కాప్ డ్రైవర్లకు జీతాలు పడలేదంటూ జోన్8 క్లాప్ డ్రైవర్లు డంపింగ్ యార్డు వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశా రు. దీంతో వేపగుంట జోన్8లో చెత్తతరలింపు ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ప్రధాన కూడళ్లలో చెత్త తరలింపునకు అధికారులు జీవీఎంసీ వాహనాలు ఏర్పాటు చేసి తాత్కాలికంగా ఉపశమన చర్యలు చేపట్టారు. జీతాల సమస్యలుంటే జీవీఎంసీ కమిషనర్‌ను కలిస్తే పరిష్కారం దొరుకుతుందని, ఎక్కడో జీతాలు ఇవవ్వలేదని ఈ జోన్‌లో నిరసన చేయడం సరికాదని ఏఎమ్‌హెచ్‌ఓ బండారు అప్పలనాయుడు, శానిటరి సూపర్‌వైజర్ ఎస్‌వీరమణ, యర్డ్ ఇన్‌చార్జి లాజరస్ తెలియజేశారు.

'డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి'

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీలు సురక్షితంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని జిల్లా వినియోగదారుల కమిషన్ మాజీ సభ్యురాలు, సీనియర్ న్యాయవాది బి.వరలక్ష్మి అన్నారు. చట్టం కల్పించిన హక్కులపై అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉంటేనే మోసాలను నివారించవచ్చునన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలపై భారత ప్రజాసంబంధాల సంఘం విశాఖశాఖ సోమవారం హోటల్ దసపల్లాలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచం పూర్తిగా ఆన్‌లైన్‌కు మారుతోందని, వినియోగదారులు పలుసేవలు, ఉత్పత్తులు ఇంటి వద్దనే పొందుతున్నారన్నారు. అదే సమయంలో మోసాలు, నకిలీ వెబ్‌సైట్లు, డేటా చోరీలు జరుగుతున్నాయన్నారు. వినియోగదారుల హక్కులు, పరిరక్షణకు కేంద్రం ప్రత్యేక చట్టం 1986 ప్రవేశపెట్టిందన్నారు. ఆంధ్రకేసరి వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ యూరోపియన్ దేశాలు వినియోగదారులకు దీర్ఘకాలిక సేవలందిస్తున్నాయన్నారు. పీఆర్‌ఎస్‌ఐ విశాఖ శాఖ అధ్యక్షుడు ఎంకేవీఎల్ నరసింహం మాట్లాడారు. పీఆర్‌ఎస్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ పీఎల్‌కే మూర్తిని సత్కరించారు. ఎ.గోవిందరావు, ఎన్‌వీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



శిథిల స్థితికి చేరిన ఆయుష్ ఆర్డీడీ కార్యాలయ భవనం



గోడలకు పగుళ్లు దేరి పెచ్చులు ఊడి పడుతున్న దృశ్యం

అధ్వాన స్థితిలో ఆయుష్ ఆర్డీడీ కార్యాలయం

- శిథిల భవనంలోనే విధులు
- పెచ్చులూడి పడుతుండడంతో ఉద్యోగుల్లో ఆందోళన
- మౌలిక సదుపాయాలు లేక మహిళా ఉద్యోగుల అవస్థలు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ విభాగానికి చెందిన రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం అధ్వాన స్థితికి చేరింది. మధురవాడలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ విభాగం కార్యాలయం అత్యంత దారుణ స్థితిలో శిథిలావస్థకు చేరడంతో ఉద్యోగులు భయాందోళన మధ్య విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది. భవనంలోని అనేక చోట్ల పెచ్చులు ఊడి పడుతున్నాయి. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఎవరిపై ఏ పెచ్చు ఊడి పడుతుందోనన్న ఆందోళనతో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆయుష్ ఆర్డీడీ కార్యాలయ పరిధిలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ఉద్యోగులు పనిచేస్తుంటారు. ఈ కార్యాలయం మూడు చిన్నపాటి గదుల్లో అధ్వాన స్థితిలో ఉంది. ఈ భవనం పరిస్థితిపై ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించ లేదు. భవనం ముందు మరో భవనం ఇదే విభాగానికి కేటాయించారు. అది మరింత శిథిలావస్థలో ఉంది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి దోమలతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఎటువైపు నుంచి పాములు, పురుగులు చొరబడతాయో తెలియక భయాందోళన మధ్య విధులు నిర్వర్తి స్తున్నారు. ఇక ఇక్కడ పనిచేసే మహిళా ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతం. కనీస స్థాయిలో మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏసీ హెల్మెట్‌లలో ఇబ్బందులను గుర్తించండి

- ట్రాఫిక్ అధికారులకు సీపీ ఆదేశం



ట్రాఫిక్ ఏడీసీపీ కార్యాలయానికి ఏసీ హెల్మెట్‌లతో విచారణకు హాజరైన కానిస్టేబుళ్లు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎండ నుంచి ఉపశమనం కోసం ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు అందజేసిన ఏసీ హెల్మెట్‌ల వినియోగంతో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పోలీసులు దృష్టిసారించారు. ఈ మేరకు నగరంలో ఏసీ హెల్మెట్‌లు వినియోగిస్తున్న వారిలో కొందరిని సోమవారం ట్రాఫిక్ ఏడీసీపీ కార్యాలయానికి పిలిచి ఆరా తీశారు. ఏసీ హెల్మెట్‌ల వినియోగంతో వైబ్రేషన్ కారణంగా తల బిగుసుకుపోవడం, మెదడు కదలి తలనొప్పికి గురవుతున్నట్టు సిబ్బంది వాపోతుండడంతో 'బాబోయ్... ఏసీ హెల్మెట్‌లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీపీ శంఖబ్రతబాగ్చి ఉదయం ఎనిమిది గంటల సమయంలో ట్రాఫిక్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏసీ హెల్మెట్‌లను సిబ్బందికి అందజేసిన తర్వాత వాటి వినియోగం, ఇబ్బందులు తెలుసుకోవాల్సిన అవసరం లేదా? అని మండిపడినట్టు తెలిసింది. ఏసీ హెల్మెట్‌లు ఇచ్చేయగానే పని అయిపోయిందన్నట్టు వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. తక్షణం ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడి హెల్మెట్‌ల కారణంగా సమస్య ఎదుర్కొంటున్నారా? ఆరోగ్యపరంగా సమస్యలు తలెత్తుతున్నాయా? అనేదానిపై వైద్యనిపుణుల సమక్షంలో విచారించాలని ఆదేశించినట్టు తెలిసిందే. ఈ మేరకు కొందరు సిబ్బందిని ట్రాఫిక్ ఏడీసీపీ కార్యాలయానికి పిలిచి, ఇబ్బందులపై విచారణ జరిపారు.

సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం లేదు: ట్రాఫిక్ ఏడీసీపీ

ట్రాఫిక్ సిబ్బంది ఏసీ హెల్మెట్‌లు ధరించి విధులు నిర్వర్తించడం వల్ల ఎలాంటి అసౌకర్యం లేదని ట్రాఫిక్ ఏడీసీపీ కె.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ హెల్మెట్‌లతో వైబ్రేషన్ రావడంలేదన్నారు. బ్యాటరీతో కలిపి హెల్మెట్ బరువు 1480 గ్రాములు మించదన్నారు. ఏసీ హెల్మెట్‌ల కారణంగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, సౌకర్యం గురించి తన చాంబర్‌కు పిలిచి ఆరా తీయగా, అందరూ సౌకర్యంగా ఉందని, ఎండ నుంచి ఉపశమనం లభిస్తోందని సంతోషం వ్యక్తంచేశారన్నారు. బ్యాటరీలను నడుముకు పెట్టుకోవడం వల్ల బరువు అనిపించదని వివరించారు.

టిడ్కో ఇళ్ల అవకతవకలపై చర్యలు తీసుకోండి

- జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి పెదజాలారిపేటలోని టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ 22వ వార్డు కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ జీవీఎంసీ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. ఐదు బ్లాకుల్లో నిర్మించిన 120 ఇళ్లలో చాలావరకు ఉద్యోగులు, సొంత ఇళ్లు కలిగినవారే దక్కించుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అందుల్లో ఇళ్లు ఇపిస్తామని యూసీడీ సిబ్బంది ఒక్కొక్కరి నుంచి రూ.ఐదు లక్షలు వరకు వసూలుచేసినట్టు తెలిసిందన్నారు. అలాగే బీచ్‌రోడ్డులోని సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్ కోసం జీవీఎంసీ ఇచ్చిన అనుమతికంటే 1600 గజాలు అదనంగా ఆక్రమించి వ్యాపారం చేసుకుంటున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రెస్టారెంట్ నిర్వాహకులు అదనంగా వాడుకుంటున్న స్థలాన్ని వేలం ద్వారా ఇతరులకు కేటాయిస్తే ఏటా రూ.కోటి ఆదాయం సమకూరుతుందన్నారు. యథేచ్ఛగా ఖాళీస్థలాన్ని ఆక్రమించి ఇతరులకు అద్దెలకు ఇచ్చి సొమ్ముచేసుకుంటున్నా అధికారులు మరోమూడేళ్లకు లీజు పొడిగించడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు.

రవాణా శాఖా మంత్రికి సాదర స్వాగతం



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని స్వాగతిస్తున్న ఆర్టీసీ ఈడీ, ఆర్ఎం

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం నగరానికి వచ్చారు. ఆయనకు ఆర్టీసీ ఉన్నతాధికారులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి, విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి ప్రవీణ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

అర్జీలు చూడని అధికారులకు షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 349 ఫిర్యాదులు



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు

మహారాణిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను వారం రోజుల్లోగా ఆన్‌లైన్‌లో చూడని బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ డీఆర్వో భవానీశంకర్, జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధికారులతో కలిసి అర్జీదారుల నుంచి 349 వినతులను స్వీకరించారు. రెవెన్యూ 111, జీవీఎంసీ 54, పోలీసు 15, ఇతర శాఖలకు 169 ఉన్నాయి. అనంతరం అధికారులతో సమీక్షించిన కలెక్టర్ మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు లాగిన్ ఓపెన్ చేసి చూడడం, క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించడం, పదే పదే వచ్చే వినతులను లోతుగా పరిశీలించడం, ప్రజలు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపడం, అర్జీదారులతో మాట్లాడి కాల పరిమితిలోగా పరిష్కరించాలని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి

ఆర్టీసీలో పనిచేసే కొంతమంది డ్రైవర్లు, కండక్టర్ల పనితీరు మార్చుకోవాలని, ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని కలెక్టర్ హెచ్చరిక స్వరంతో ఆదేశించారు.

జీవీఎంసీకి 118 వినతులు

వెంకోజీపాలెం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్)లో సోమవారం జీవీఎంసీలోని అన్ని విభాగాలకు 118 వినతులు వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లతో మాట్లాడుతూ అర్జీలను వెంటనే పరిశీలించి ఫిర్యాదుదారులనుసంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకూడదన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపు



మేయర్‌ను సత్కరిస్తున్న విశాఖ సిటిజన్ ఫోరం ప్రతినిధులు. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా, గణబాబు, విష్ణుకుమార్‌రాజు

డాబాగార్డెన్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి మేధావులు, విశ్రాంత ఉద్యోగులు, విశాఖలో స్థిరపడినవారు భాగస్వాములు కావాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో సోమవారం విశాఖ సిటిజన్ ఫోరం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, విష్ణుకుమార్ రాజులతో కలిసి మేయర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ సిటిజన్ ఫోరం వెల్ఫేర్ సొసైటీ ఏదైనా సమస్య ఎదురైతే ముందుకురావడం అభినందనీయమన్నారు. మేధావులు కలిసి విద్య, ఉపాధి, వైద్య రంగాల్లో మెరుగైన సాధనకు కృషి చేయడం మంచి విషయమన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖను మరింతగా అభివృద్ధి చేసుకునేందుకు ఐకమత్యంగా ముందుకు సాగుదామన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఎంతో కాలంగా సిటిజన్ ఫోరం చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కష్టమొచ్చినప్పుడు ఒకరికొకరు తోడుగా నిలవడం ప్రస్తుతం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమానికి సొసైటీ గౌరవాధ్యక్షుడు పెంటకోట వెంకటరావు అధ్యక్షత వహించి సిటిజన్ ఫోరం ముఖ్య ఉద్దేశం తెలిపారు. వివిధ విభాగాల్లో ఉన్నవారంతా కలిసి నగరాభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్.తిలక్, కార్యదర్శి పి.రామకృష్ణ, దాడి రత్నాకర్, మళ్ల సురేంద్ర, కూటికుప్పల సూర్యారావు, ఆడారి ఆనందరావు, బీశెట్టి బాబ్జీ, బుద్ధ శివాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మేయర్ శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీల ఆందోళన



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎంవీపీ కాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ఎఫ్ఆర్ఎస్ వెంటనే రద్దుచేయాలని, సెంటర్ నిర్వహణను ఒక యాప్‌ద్వారా మాత్రమే చేయించాలని, పని చేసేందుకు ఫోన్లు ఇవ్వాలని, రికార్డులు అందించాలని, యాప్ ట్రైనింగ్ ఇవ్వాలని, పని భారాన్ని తగ్గించాలని, కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మినీ కేంద్రాల ఏర్పాటుకు జీవో వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలతో ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ నినాదా లు చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

గోడ కూలిన ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.18 లక్షల పరిహారం

మల్కాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డాక్‌యార్డు సమీపంలో గల ప్రత్యూష గోడౌన్స్‌లో ఆదివారం రాత్రి గోడ కూలిన ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు గోడౌన్స్ యజమాన్యం రూ.9 లక్షల చొప్పున పరిహారం అందజేసింది. అంబేడ్కర్ కాలనీకి చెందిన ధర్మారావు, జనతాకాలనీకి చెందిన రామారావు పనులు చేస్తుండగా గోడ కూలి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయమై కార్పొరేటర్లు పీవీ సురేశ్, బల్ల లక్ష్మణరావు, టీడీపీ నేతలు మజ్జి మాలినాయుడు, గేదల రమణ, వైసీపీ నేత అనిల్, సీపీఎం నేత పెంటరావు, నాయుడు, పెద్దాడ ప్రసాద్ యజమాన్యంతో చర్చలు జరిపారు. ఒక్కో కుటుంబానికి రూ.8 లక్షల పరిహారం, అంత్యక్రియలకు రూ.లక్ష చొప్పున అందజేశారు.

ప్రజాచైతన్యంతోనే పక్కాగా చట్టాల అమలు

- యూపీఎస్‌సీ మాజీ చైర్మన్ ఆచార్య కేఎస్ చలం



ఆడిట్ నివేదికను చూపిస్తున్న ఆచార్య కేఎస్ చలం, తదితరులు

సీతంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అత్యాచార నిరోధక చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలయ్యేలా ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత దళిత సంఘాలపై ఉందని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మాజీ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సిటిజన్స్ విజిలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో 'సిటిజన్స్ ఆడిట్ రిపోర్ట్' అనే అంశంపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ చట్టాన్ని అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నట్టు సామాజిక తనిఖీ (సివిల్‌ఆడిట్) నివేదికలో తేటతెల్లమైందన్నారు. దళిత ఆదివాసీలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయని, దేశవ్యాప్తంగా అంతులేని వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటే చట్టాల అమలు ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందన్నారు. సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ, దళిత బహుజన శ్రామిక యూనియన్ సంయుక్తంగా రూపొందించిన నివేదికను ఆచార్య చలం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎన్‌సీడీ హెచ్‌ఆర్ ఏపీ చాప్టర్ రాష్ట్ర కన్వీనర్ పి.చిట్టిబాబు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రైం... crime news

పాఠశాల బస్సు ఢీకొని బాలుడి మృతి

కొమ్మాది, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొనడంతో బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం పీఎం పాలెంలో జరిగింది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలమేరకు పీఎం పాలెం కార్‌షెడ్ కూడలి వద్ద ప్రమోద్ సింగ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తుంటాడు. బక్కన్నపాలెం టిడ్కో ఇళ్ల లో నివాసం ఉంటున్నాడు. నగరంలోని పాతపోస్టాఫీస్ వద్ద సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అతని కుమారుడు హర్షవర్ధన్ టిడ్కో ఇళ్ల సమీపంలో సైకిల్‌పై వెళ్తుండగా ఒక ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం



విశాలాక్షినగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 9వ వార్డు పరిధి జోడుగుళ్లపాలెం వద్ద సోమవారం జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ ఓ మృతదేహాన్ని గుర్తించారు. ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రామదాస్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయసుగల పురుషుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో 24 కేజీల గంజాయి పట్టివేత

- కోర్టుకు నలుగురు నిందితుల తరలింపు

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైల్లో వేర్వేరుగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి 24 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన రాహుల్ కుమార్ వద్ద పది కిలోలు, మరో కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోహన్ చౌదరి, కిషన్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇంకో కేసులో కొరాపుట్‌కు చెందిన దశరథ్ నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించామన్నారు.

చార్టెడ్ అకౌంటెంట్ ఇంట్లో భారీ చోరీ

- 100 గ్రాముల బంగారు ఆభరణాలు పోయాయని ఫిర్యాదు

సీతంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లో గల ఒక ఇంటిలో దొంగలు చొరబడి బీరువాలో గల సుమారు 100 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న విక్రమ ఆదిత్య చార్టెడ్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న కుటుంబ సభ్యులతో కలిసి పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లారు. తిరిగి ఈ నెల 20న రాత్రి ఇంటికి వచ్చారు.

ఇంటి తలుపులు తీసి లోపలకు వెళ్లి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో పెట్టిన బంగారు గొలుసులు, నల్లపూసల దండ, ఉంగరాలు మొదలైనవి కనిపించలేదు. ఇంటి వెనుక ఉన్న కిటికీ తలుపులు విరగ్గొట్టి ఉన్నాయి. దొంగలు ఈ మార్గంగుండా లోపలకు వచ్చినట్టు గుర్తించారు. దీంతో ద్వారకా పోలీసులకు విక్రమ ఆదిత్య ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాజు తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వెళ్లి సంఘటన స్థలంలో నమూనాలు సేకరించారు. ఎస్ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు

'మైనర్లకు ఇచ్చిన పట్టాలు రద్దుచేయండి'

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం కోసం ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే పట్టాలలో కొందరు మైనర్లకు అగనంపూడి దరి డొంకాడ సర్వేనంబరు 207లో ఇచ్చారని అదే గ్రామానికి చెందిన దాసరి ఈశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో పలు అంశాలను ప్రస్తావించారు. ఇళ్లు కోల్పోయిన వారిలో 1980 నాటికి 18 ఏళ్లు నిండినవారు అర్హులని అప్పట్లో ప్రభుత్వం స్పష్టం చేసిందని, అయితే 14 మంది మైనర్లకు పట్టాలిచ్చారన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఉక్కు భూసేకరణ విభాగం అధికారులు పట్టించుకోలేదని, దీనిపై సమగ్రంగా విచారణ జరిపి, అనర్హులకు ఇచ్చిన పట్టాలు రద్దుచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు.

అర్బన్ రిటైర్డ్ ఎమ్మార్వో పింఛన్‌లో కోత

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం సర్వేనంబరు 12/బిలో ఉన్న భూమి సర్వే, రెవెన్యూ, సెటిల్‌మెంట్ రిజిస్టర్‌లో మ్యూటేషన్‌పై ఆరోపణల నేపథ్యంలో సీతమ్మధార ఎమ్మార్వో (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు) బి.భవానీదాస్ పింఛన్‌లో కోత విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆరోపణలపై జిల్లా యంత్రాంగం విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ మేరకు ఐదేళ్లపాటు ప్రతి నెలా పింఛన్‌లో ఐదుశాతం కోత విధిస్తూ భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి ఉత్తర్వులు విడుదల చేశారు.